E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 27-01-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక: 27 || పేజీలు–6 www.ekaburu.com



బంగారు కొండ మరింత ఎత్తుకు » 4లో

## స్టూడెంట్ రేవంత్!



» పుస్తకాలు చేతబట్టి హార్వర్డ్ యూనివర్సిటీ క్లాసులకు..
» '21వ శతాబ్దంలో నాయకత్వం' అంశంపై కోర్సు
» 30వ తేదీ దాకా క్లాసులు.. తొలి రోజు హాజరైన సీఎం
» ఉదయం 7 నుంచి సాయంత్రం 6 దాకా తరగతులు
» హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్న తొలి సీఎంగా రికార్డు.. 2న రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి

ఈకబురు, హైదరాబాద్,: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన కాలేజీ రోజులు గుర్తుకొచ్చి ఉంటాయి కావొచ్చు! కారణం.. ఆయన మళ్లీ కాలేజీ విద్యార్థిగా మారారు. అదీ అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం స్టూడెంట్‌గా! చక్కగా మెడలో ఐడీ కార్డు వేసుకొని.. పుస్తకాలు చేతబట్టి సోమవారం పొద్దుపొద్దున్నే భారీగా కురుస్తున్న మంచు మధ్య వణికించే చలిలో హార్వర్డ్ పరిధిలోని మసాచుసెట్స్‌లోని కెనడీ స్కూల్‌కు వెళ్లారు. అక్కడ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

తరువాయి 2లో

# గణతంత్ర వేడుకల్లో 'సిందూర' స్ఫూర్తి!




» కర్తవ్యపథ్‌లో ఘనంగా వేడుకలు ప్రధాన ఆకర్షణగా సిందూర్ శకటం
» బ్రహ్మోస్ నుంచి సూర్యాస్త్ర దాకా అలరించిన ఆయుధ వ్యవస్థలు
» అమేయ సైనిక శక్తికి, యుద్ధ సన్నద్ధతకు అద్దం పట్టిన కవాతు
» సాంస్కృతిక వైవిధ్యానికి తార్కాణంగా నిలిచిన శకటాలు
» ముఖ్య అతిథులుగా ఈయూ సారథులు ఉర్సులా, కోస్టా
» వారిని సంప్రదాయ బగ్గీలో తోడ్కొని వచ్చిన రాష్ట్రపతి

ఈకబురు, న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ శకటం, ఆ పోరాటంలో పాక్ పీచమణచిన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు, అతి శక్తిమంతమైన క్షిపణులు, కొత్త తరం యుద్ధ విమానాలు, సరికొత్త సైనిక విభాగాలు... ఇలా అమేయమైన భారత సైనిక శక్తిని 77వ గణతంత్ర దిన వేడుకలు కళ్లకు కట్టాయి. సిందూర్ థీమ్‌తో రూపొందిన భారత సైన్య శకటం అందరినీ ఆకట్టుకుంది. ఇక దేశీయంగా రూపొందించిన పలు ప్రళయ భీకర ఆయుధాలు ఆహూతులను ఆద్యంతం అలరించాయి. ముఖ్యంగా 150 ఏళ్ల వందేమాతరం థీమ్ ఉర్రూతలూగించింది. సోమవారం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు ఇందుకు వేదికగా నిలిచాయి. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లెయన్ ఈసారి గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారిని వెంటబెట్టుకుని సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకలకు విచ్చేశారు. అనంతరం త్రివిధ దళాధిపతి హోదాలో సైనిక వందనం అందుకున్నారు. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, త్రివిధ దళాధిపతులు, సైనిక, ప్రభుత్వ ఉన్నతాధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. పలు రంగాల ప్రముఖులతో పాటు మొత్తం 10 వేల మందికి పైగా వేడుకలకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో 'సారే జహాసె అచ్ఛా', 'కదం కదం బఢాయె జా'వంటి దేశభక్తి గీతాలతో పాటు వందేమాతరం అందరిలోనూ స్ఫూర్తి నింపాయి. 90 నిమిషాల పాటు జరిగిన వేడుకలో 18 సైనిక దళాలు, 13 సైనిక బ్యాండ్లు అలరించాయి. వేడుక అనంతరం రాష్ట్రపతి ప్రత్యేక అతిథులతో పాటుగా గుర్రపు బగ్గీలోనే వెనుదిరగడం విశేషం.

తరువాయి 2లో

## భారత్‌ఈయూ వాణిజ్య ఒప్పందం వేళ.. అమెరికా కీలక వ్యాఖ్యలు

» 4లో



## 2026-27 నిర్మలమ్మ పద్దు.. లెక్కలేసింది వీళ్లే..!

» మరికొద్ది రోజుల్లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వరుసగా తొమ్మిదోసారి ఆర్థిక పద్దు (2026/27)ను ప్రవేశపెట్టి.. మాజీ మంత్రి పి.చిదంబరం రికార్డును సమం చేయనున్నారు. ఫిబ్రవరి 1న లోక్‌సభ వేదికగా ఆమె చేయబోయే బడ్జెట్ ప్రకటనలపై యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రధాని మోదీ మూడో హయాంలో ప్రవేశపెట్టనున్న మూడో పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. ఈ సందర్భంగా కేంద్ర పద్దు లెక్కలేసిన నిర్మలమ్మ టీమ్ ఎవరో చూద్దాం..!



తరువాయి4లో

## నైనీ స్కాం నుంచి దృష్టి మళ్లించే యత్నం

» సంతోశ్ కుమార్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష సాధింపు: కేటీఆర్
» నేడు సింగరేణి స్కాంపై గవర్నర్‌కు ఫిర్యాదు



ఈ-కబురు, నైనీ బొగ్గు గని కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిట్ నోటీసుల డ్రామా ఆడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ప్రకటనలో విమర్శించారు.

తరువాయి 2లో

# సంతోష్‌రావుకు సిట్ నోటీసులు

» ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు రావాలని పిలుపు
» నోటీసులపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
» ట్యాపింగ్ కోసం అధికారులకు వచ్చిన ఫోన్ నంబర్లన్నీ సంతోష్‌రావు నుంచే?
» దీనిపై ప్రశ్నించనున్న సిట్ అధికారులు?



ఈ-కబురు, హైదరాబాద్, జనవరి 26 ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత కొద్దిరోజులుగా వరుసగా బీఆర్ఎస్ కీలక నేతలను విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజాగా మరో కీలక నేతను విచారణకు పిలిచింది. ఆ పార్టీ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావుకు సిట్ సోమవారం నోటీసులు జారీ చేసింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరుకావాలని పేర్కొంది. సిట్ నోటీసులను సంతోష్‌రావు కూడా ధ్రువీకరించారు.

తరువాయి 2లో



## రేవంత్ బాటలో కవిత

ఈ-కబురు,హైదరాబాద్, : బీఆర్ఎస్‌ను విమర్శించడంలో సీఎం రేవంత్‌రెడ్డి బాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత నడుస్తోందని, కేసీఆర్‌ను దోషిగా నిలబెట్టాలని చూస్తున్నారని ఆ పార్టీ మహిళా నేతలు ఆరోపించారు.

2లో »

## తెలంగాణ రైజింగ్

# సంక్షేమంతో సమగ్ర అభివృద్ధి

» మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటీ రంగాల్లోనూ పురోభివృద్ధి
» రెండేళ్లలో తెలంగాణలో విశేష ప్రగతి
» రూ.20,617 కోట్లతో 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ
» వరి ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానం
» 62,749 మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు
» రూ.500కే సిలిండర్‌తో 42.90 లక్షల కుటుంబాలకు లబ్ధి
» బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు నిజమైన నివాళి
» గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



ఈకబురు,హైదరాబాద్: ''గత రెండేళ్లలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, వ్యవసాయం, మౌలిక వసతులు, డిజిటల్ విద్య, ఐటీ రంగాల్లో విశేష పురోగతిని సాధించింది. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది'' అని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో సోమవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ, రాష్ట్ర గీతాలాపన అనంతరం... సైనిక, వైమానిక దళాలు, రాష్ట్ర పోలీసులు, కొత్తగా ఏర్పడిన డిజాస్టర్ ఫోర్స్, ఎన్‌సీసీ క్యాడెట్లు, గురుకుల విద్యార్థుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. అంతకుముందు గవర్నర్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎస్ కె.రామకృష్ణారావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైనిక అమరవీరుల స్తూపం వద్ద ఉప ముఖ్యమంత్రితో కలిసి నివాళి అర్పించారు. ఉత్తమ కవాతు ప్రదర్శనకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగిస్తూ... ''సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రజాప్రభుత్వం గణనీయ విజయాలను సాధించి.. ప్రజల విశ్వాసాన్ని, ప్రశంసలను సంపాదించింది. రెండేళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్2047' అనే దార్శనికపత్రాన్ని ఆవిష్కరించింది. సమగ్ర, సుస్థిర అభివృద్ధికి రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది. వికసిత్ భారత్ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదేబాటలో తెలంగాణ సైతం 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా అవతరించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్... అనే మూడు ప్రాంతాల్లోనూ సమాన అభివృద్ధి సాధించాలని నిర్ణయించుకున్నది.

తరువాయి 2లో

## సామాన్యులను విస్మరించి కార్పొరేట్లకు

# కొమ్ముకాస్తున్న భాజపా




ఈకబురు,హైదరాబాద్: నల్లకుంట: సామాన్యులను విస్మరించి కార్పొరేట్లకు పట్టం కట్టేలా భాజపా వ్యవహరిస్తోందని, ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధవాలే అన్నారు. మహాసభల ప్రతినిధుల సమావేశాల సందర్భంగా సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, అస్సాం, ఆంధ్రప్రదేశ్, త్రిపుర, ఒడిశా, మణిపుర్ రాష్ట్రాల్లో సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి భాజపా.. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మణిపుర్ రాష్ట్రం ఘర్షణలతో అట్టుడికి, ఒత్తిడి పెరిగిన తర్వాతే అక్కడ భాజపా ముఖ్యమంత్రిని మార్చారని.. శాంతియుత పరిస్థితుల కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడలేని భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహారాష్ట్ర, ఒడిశాలో మహిళలు, ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా భాజపా మోసం చేసిందని విమర్శించారు. పుదుచ్చేరిలో రేషన్‌కు బదులుగా నగదు బదిలీ చేస్తున్నారని, దీంతో ఆహార భద్రత లక్ష్యం నెరవేరడం లేదని మండిపడ్డారు. ఒడిశాలో తొలిసారిగా భాజపా అధికారంలోకి రాగానే కుష్ఠు రోగులకు సేవలందిస్తున్న గ్రాహం స్టెయిన్స్, ఆయన కుమారులను సజీవదహనం చేసిన హంతకుడు ధారాసింగ్‌ను జైలు నుంచి వదిలేశారని మండిపడ్డారు. ఒడిశాలో అటవీ భూమి ఎక్కువగా ఉందని, దాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని కుట్రలు చేస్తున్నారని, సంక్షేమ పథకాలను తగ్గిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జాతీయ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ అర్చన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తరువాయి 2లో

# స్టూడెంట్ రేవంత్!





అప్పట్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థిగా మూడేళ్లపాటు హైదరాబాద్ జేఎన్‌టీయూలో తరగతులకు హాజరైన రేవంత్, ఇప్పుడు సీఎం హోదాలో రోజుల వ్యవధిలోనే హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయనున్నారు. ఆ కొన్ని రోజుల్లోనే క్లాసులు విని.. హోంవర్కులు రాసి, అసైన్‌మెంట్‌లు పూర్తిచేసి.. వాటిని క్లాసులో సమర్పించి ప్రఖ్యాత వర్సిటీ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్నారు. వర్సిటీ నిర్వహించే "లీడర్‌షిప్ 21 సెంచరీ" అనే కోర్సుకు సంబంధించి కెనడీ స్కూల్ ప్రాంగణంలో క్లాసులు సోమవారం మొదలయ్యాయి. ఈ క్లాసులు 30వ తేదీ వరకు జరుగుతాయి. ఈ కోర్సు కోసం ఐదు ఖండాల నుంచి 20 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరందరితో కలిసి సోమవారం మొదలైన క్లాసులకు రేవంత్ హాజరయ్యారు. సీఎం పదవిలో కొనసాగుతూ హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఒక కోర్సు సర్టిఫికెట్ అందుకున్న సీఎంగా రేవంత్ రికార్డు సృష్టించనున్నారు. తొలిరోజు పరిచయ కార్యక్రమాల అనంతరం కోర్సులో భాగంగా "అఉధికార విశ్లేషణ.. నాయకత్వం" అంశంపై తొలిసెషన్ ప్రారంభమైంది. ఉదయం ఏడింటికే మొదలైన తరగతులు సాయంత్రం ఆరింటిదాకా కొనసాగాయి. కేస్ అనాలసిస్ సహా వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్‌వర్క్ వంటి కార్యక్రమాల్లో ప్రతినిధులు పాల్గొన్నారు. కోర్సులో భాగంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుంచి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. ఆ తర్వాతే కోర్సు ముగుస్తుంది. ఆపై.. యూనివర్శిటీ నుంచి సీఎం రేవంత్ సర్టిఫికెట్ పొందనున్నారు. అనంతరం ఆయన అమెరికా నుంచి తిరుగు ప్రయాణమవుతారు. ఫిబ్రవరి 2న ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. కాగా క్లిష్టమైన పరిస్థితుల్లో ఎలాంటి నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలి? అనిశ్చిత పరిస్థితులను, అనుకోని మార్పులను ఎలా ఎదుర్కోవాలి? సంబంధించిన అంశాలు కోర్సులో ఉంటాయి. ఇది రాజకీయ నాయకులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు, కార్పొరేట్ కంపెనీల సీఈవోలు, డైరెక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఉపయుక్తంగా ఉంటుంది.

హార్వర్డ్ విశేషాలు..

హార్వర్డ్ యూనివర్శిటీ పరిధిలోని ప్రైవేటు ఐవీ లీగ్ పరిశోధన విశ్వవిద్యాలయం మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జిలో ఉంది. దీనిని 1607లో స్థాపించారు. అంటే దాదాపు 418 ఏళ్ల చరిత్ర కలిగిన యూనివర్శిటీ ఇది. గత వందేళ్లలో దాదాపు 75 సార్లు ప్రపంచంలో నంబర్‌వన్ విశ్వవిద్యాలయంగా నిలిచింది. దీని పరిధిలో 14 కళాశాలలున్నాయి. బిజినెస్ (హెచ్‌బీఎస్), లా (హచ్‌ఎల్‌ఎస్), మెడికల్, గవర్నమెంట్, థియాలజీ శాస్త్రాలకు విడి విడిగా కళాశాలలు ఉన్నాయి. కాగా కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను 1936లో స్థాపించగా, 1966లో అధ్యక్షుడు కెనడీ పేరును పెట్టారు. స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో దాదాపు 100కు పైగా దేశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. కాగా ప్రస్తుతం బోస్టన్‌లో భారీ మంచు తుపాను (ఫెర్న్) కారణంగా రెండు అడుగులకు పైగా మంచు కురిసినట్లు సమాచారం. ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీలకు పడిపోయాయి.

# నైనీ స్కాం నుంచి దృష్టి మళ్లించే యత్నం



ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ పేరుతో మాజీ ఎంపీ సంతోశ్ కుమార్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విచారణ అంతా ఒక అట్టర్ ఫ్లాప్ టీవీ సీరియల్‌లా సాగుతోందని ధ్వజమెత్తారు. అసలైన నిందితులను వదిలేసి కేసుతో సంబంధం లేని ప్రతిపక్ష నేతలను విచారణకు పిలవడం కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని విమర్శించారు. మునిసిపల్ ఎన్నికల ముందు ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేందుకే వరుసగా బీఆర్‌ఎస్ నాయకులను వేధిస్తున్నారని ఆరోపించారు. బొగ్గు కుంభకోణంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తామని తాము ప్రకటించిన వెంటనే సంతోశ్‌కు నోటీసులు రావడం యాదృచ్ఛికం కాదని.. ఇది ముందస్తు ప్రణాళికతో చేసిన దృష్టి మళ్లింపు చర్య అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే తనను, హరీశ్‌రావును విచారించినా ఏమీ సాధించలేకపోయారని, ఇప్పుడు సంతోశ్‌ను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, అక్రమాలు, అరాచకాలతో కూడిన ఎనుముల రాజ్యాంగం నడుస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాజ్యాంగ ఉల్లంఘనలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు లఘునాటిక ప్రదర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఏ విధంగా తుంగలో తొక్కుతున్నారో హెచ్‌సీయూ విద్యార్థులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారని అభినందించారు. కాగా, సింగరేణి టెండర్లలో కాంగ్రెస్ నేతల కుంభకోణంపై ఫిర్యాదు చేసేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ నేతల బృందం మంగళవారం కలవనుంది. సింగరేణిలో జరిగిన అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలను గవర్నర్‌కు అందించి, సమగ్ర విచారణ జరిపించాలని కోరతామని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు.

# సంతోష్‌రావుకు సిట్ నోటీసులు



మొదటి పేజి తరువాయి

నోటీసుల్లో పేర్కొన్న ప్రకారం దర్యాప్తు అధికారుల ఎదుట విచారణకు హాజరవుతానని ప్రకటించారు. కాగా, సిట్ ఎదుట విచారణకు హాజరు కావడానికి ముందు బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ నాయకులు, శ్రేణులతో సంతోష్‌రావు సమావేశం కానున్నట్లు, అక్కడి నుంచి నేరుగా సిట్ కార్యాలయానికి చేరుకోనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటిదాకా విచారించిన వారందరినీ ఉదయమే హాజరు కావాల్సిందిగా సూచించిన సిట్ అధికారులు.. సంతోష్‌రావు విషయంలో మాత్రం భిన్నమైన సమయాన్ని ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తోపాటు ఇతర పార్టీల నాయకులు, అధికారులు, మాజీ అధికారులు, సాక్షుల్ని కూడా నిర్ణీత తేదీలో ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ సూచించింది. కానీ, సంతోష్‌రావును మాత్రం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు రావాలని పేర్కొంది. అయితే నాలుగు రోజుల క్రితం కేటీఆర్‌ను విచారించిన సమయంలో ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాధాకిషన్‌రావును అదే సమయంలో సిట్ కార్యాలయానికి పిలిచి విచారించారు. దీంతో సంతోష్‌రావును విచారించే సమయంలోనూ అదే పద్ధతిని అవలంబించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నోటీసుల్లో ఏముందంటేసంతోష్‌రావుకు సిట్.. సెక్షన్ 160 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేసింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైం నంబరు 243/2024లో ఐపీసీ సెక్షన్లు 166, 409, 427, 201, 120(బీ) రెడ్ విత్ 34. పీడీపీపీ యాక్ట్‌లోని సెక్షన్ 3, ఐటీ యాక్ట్‌లోని సెక్షన్ 65, 66, 66(ఎఫ్)(1)(బీ)(2) 70 కింద నమోదైన కేసులో తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది. ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా కొంత సమాచారం సేకరించాల్సి ఉందని తెలిపింది. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షులుగా పేర్కొంటున్న వారికి, ప్రత్యేకించి బీఆర్‌ఎస్ నాయకులకు జారీ చేస్తున్న నోటీసులు ఐపీసీ సెక్షన్ 160 సీఆర్‌పీసీ కింద ఉంటున్నాయి. ఈ సెక్షన్ దర్యాప్తు అధికారికి.. విచారణ సమయంలో సాక్షులు, సంబంధిత వ్యక్తులను హాజరు కావాలని ఆదేశించే అధికారాన్నిస్తుంది. ఈ సెక్షన్ కింద నోటీసులు అందుకున్న వ్యక్తి ఒకవేళ విచారణకు హాజరు కాకపోతే.. ఐపీసీలోని సెక్షన్ 174 కింద ఉద్దేశపూర్వకంగానే హాజరుకానట్లు భావించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించే అధికారం దర్యాప్తు అధికారులకు ఉంటుంది.

**సంతోష్‌రావు నుంచే ఫోన్ నంబర్లు?**

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు చేసిన పోలీస్ అధికారులను విచారించిన సమయంలో సిట్ కీలక సమాచారం సేకరించింది. వారి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను విశ్లేషించిన సమయంలోనూ కీలక ఆధారాలు సేకరించింది. నిందితులు తమ ఫోన్లను ఫార్మాట్ చేయించి మొత్తం సమాచారాన్ని తుడిచి పెట్టినా.. ఎఫ్ఎస్ఎల్‌కు పంపించి రిట్రీవ్ చేసి ఆ సమాచారాన్ని తిరిగి రాబట్టారు. కాగా, వారిని విచారించిన సమయంలో.. ఏ నంబర్‌ను ట్యాప్ చేయాలనే ఆదేశాలు అప్పటి ఎంపీ సంతోష్‌రావు నుంచే అందేవని గుర్తించినట్లు తెలిసింది. అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుతోపాటు టాస్క్‌ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావు, ఎస్ఐబీలో డీఎస్పీలుగా పనిచేసిన ప్రణీత్‌రావు, మరికొందరికి సంతోష్‌రావు నుంచే ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో విచారణలో ఇదే అంశంపై ఆయనను ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. సిట్ చీఫ్‌గా ఉన్న వీసీ సజ్జనార్ నేతృత్వంలో విచారణ క్రమం, అడగాల్సిన ప్రశ్నలకు సంబంధించి దర్యాప్తు అధికారులు ఒక ప్రణాళిక, ప్రశ్నావళి సిద్ధం చేసుకున్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో సంతోష్‌రావును కూడా సిట్ విచారణకు పిలిచే అవకాశం ఉందని 'ఆంధ్రజ్యోతి' నాలుగు రోజుల క్రితమే చెప్పింది.

త్వరలో కేసీఆర్ వంతు?

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు.. బీఆర్‌ఎస్ కీలక నేతలను ఒక్కొక్కరిని పిలిచి విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్నారు. అవసరమైతే మరోసారి తమ ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పి పంపుతున్నారు. ఇప్పటివరకు మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ప్రశ్నించిన సిట్.. ఇప్పుడు సంతోష్‌రావు విచారణకు పిలిచింది. దీంతో త్వరలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సైతం నోటీసులు జారీ అవుతాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు చేసిన నిందితులను విచారించిన సమయంలో.. తాము బిగ్‌బాస్ ఆదేశాల మేరకే పనిచేస్తామని వారు చెప్పుకొచ్చారు. దీంతో బిగ్‌బాస్ ఎవరనేది సిట్ ఇప్పటికే రాబట్టినట్లు, త్వరలోనే ఆయనకూ నోటీసులు జారీ చేసి ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. అప్పట్లో కొందరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో.. నాటి సీఎం కేసీఆర్ ప్రగతి భవన్‌లో కొన్ని ఆడియోలను బహిర్గతం చేశారు. ఆ ఆడియోలు సైతం ట్యాపింగ్ నుంచి సేకరించినవేనన్న ఆరోపణలున్నాయి. మొత్తంగా అన్ని ఆధారాల మేరకు ఆయనకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## రేవంత్ బాటలో కవిత



సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు తుల ఉమ, సుశీలారెడ్డి, రాజ్యలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ అవినీతి, కుంభకోణాలను బీఆర్ఎస్ నేతలు ఎండగట్టిన మర్నాడే కవిత ప్రెస్‌మీట్ పెట్టి బీఆర్ఎస్‌ను, ఆ పార్టీ నేతలను విమర్శిస్తున్నారన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీలపై నిలదీయడం లేదని, అధికార పార్టీని ప్రశ్నించడం మాని ప్రతిపక్షంపై విమర్శలు చేయడం ఆమె అవివేకానికి నిదర్శనమని చెప్పారు. పార్టీకి నష్టం కలిగించేలా ఏ ఉద్దేశంతో విమర్శలు చేస్తున్నారో ఆమె చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బయటకువెళ్లి విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇంతకుముందు అవినీతి కనిపించలేదా అని నిలదీశారు. బీఆర్ఎస్‌పై విమర్శలు ఆపకుంటే సహించేదిలేదని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు.

సామాన్యులను విస్మరించి కార్పొరేట్లకు

## కొమ్ముకాస్తున్న భాజపా




నాలుగు తీర్మానాల ఆమోదం

మహాసభ రెండోరోజు సమావేశంలో నాలుగు తీర్మానాలు ఆమోదం పొందాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడులను నిరసిస్తూ.. పాలస్తీనా, వెనిజువెలాకు సంఘీభావంగా తీర్మానాలు చేశాం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓట్లను తొలగించారు. దానిని వ్యతిరేకిస్తూ మరో తీర్మానం చేశాం. దేశవ్యాప్తంగా ముస్లింలు, క్రైస్తవులతోపాటు ఇతర అల్పసంఖ్యాకవర్గాలపై దాడులు నిరసిస్తూ మరోతీర్మానంపై మహాసభలో చర్చించగా ఆమోదం పొందింది. రెండో రోజు సమావేశంలో తెలంగాణ సహా 16 రాష్ట్రాల ప్రతినిధులు అక్కడి పరిస్థితులను వివరించారు.

# గణతంత్ర వేడుకల్లో 'సిందూర' స్ఫూర్తి!

సాయుధ పాటవం సాహో...

త్రివిధ దళాల సైనిక పాటవ ప్రదర్శనకు గణతంత్ర వేడుకలు వేదికగా నిలిచాయి. గణతంత్ర పరేడ్‌కు పరేడ్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ సారథ్యం వహించారు...

బ్రహ్మోస్ సూపర్ సానిక్ క్షిపణులు, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, సూర్యాస్త్ర యూనివర్సల్ రాకెట్ లాంచింగ్ వ్యవస్థ, అర్జున్ యుద్ధ ట్యాంకు, ధనుష్ ఆర్టిలరీ గన్స్, దివ్యాస్త్ర బ్యాటరీ వంటివి అందరినీ అలరించాయి.

100 మందికి పైగా కళాకారులు ప్రదర్శించిన స్ఫూర్తిదాయకమైన 'భిన్నత్వంలో ఏకత్వం'థీమ్ ఆకట్టుకుంది.

స్వతంత్ర భారత చరిత్రలోనే తొలిసారిగా సైన్యం 'యుద్ధ వ్యూహ అమరిక'ద్వారా తన పాటవాన్ని పూర్తిస్థాయిలో ప్రదర్శించడం విశేషం.

ఆ క్రమంలో, గత మేలో పాక్ పీచమణచిన ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోషించిన క్షిపణులు, యుద్ధ విమానాలు, ఆయుధ వ్యవస్థలను కళ్లకు కడుతూ రూపొందించిన త్రివిధ దళాల శకటం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ సెంటర్, ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో శకటం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. సిందూర్ ఆపరేషన్ వేళ బ్రహ్మోస్ క్షిపణులు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర వ్యవస్థలతో పాటు పాక్‌లోని కీలక నగరాల్లో ఎయిర్ బేస్‌లను నేలమట్టం చేయడం, ఎస్-400 డిఫెన్స్ వ్యవస్థలు పాక్‌దాడులను పూర్తిస్థాయిలో అడ్డుకోవడం తెలిసిందే.

టీ-90 భీష్మ, అర్జున్ యుద్ధట్యాంకులు, బీఎంపీ-2 పదాతి దళ వాహనం, నాగ్ క్షిపణి వ్యవస్థ ముందు నడుస్తుండగా తేలికరకం అత్యాధునిక ధ్రువ్, అపాచీ ఏహెచ్-64ఈ, ప్రచండ్ హెలికాప్టర్లు వాటికి రక్షణగా సాగాయి. రోబోటిక్ శునకాలు, మానవరహిత యుద్ధ వాహనాలు వాటిని అనుసరించాయి.

భారీ వాహనాలపై తరలివచ్చిన శక్తిబాణ్, దివ్యాస్త్ర తర్వాత తరపు అత్యాధునిక యుద్ధ సామర్థ్యానికి అద్దం పట్టాయి.

కొత్తగా ఏర్పడిన భైరవ్ పదాతి దళ బెటాలియన్ కవాతు ఆకట్టుకుంది. సంప్రదాయ పదాతి దళం, ప్రత్యేక దళాల మేలుకలయికగా దీన్ని రూపొందించారు.

నేవీ, వాయు సేన నుంచి 144 మంది చొప్పున యువ సిబ్బందితో జరిగిన కవాతులు అలరించాయి.

క్రీస్తుపూర్వం ఐదో శతాబ్దికి చెందిన నావ థీమ్‌తో రూపొందించిన నావిక దళ శకటం ప్రధానాకర్షణగా నిలిచింది.

డీఆర్‌డీఓ రూపొందించిన అత్యాధునిక హైపర్‌సోనిక్ గ్లైడ్ మిసైల్ ఎల్ఆర్-ఏఎస్‌హెచ్‌ఎంను అంతా ఆసక్తిగా తిలకించారు.

సీఆర్పీఎఫ్, సశస్త్ర సీమాబల్ డేర్‌డెవిల్ మోటార్‌సైకిల్ రైడర్ బృందాల సంయుక్త విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఇక ఆహూతులంతా ఆసక్తిగా ఎదురు చూసిన ఏరియల్ ఫ్లైపాస్ట్ విన్యాసాలు ఉర్రూతలూగించాయి. 29 విమానాలు ఇందులో పాల్గొన్నాయి. వాటిలో 16 యుద్ధ విమానాలు కాగా నాలుగు రవాణా విమానాలు, 9 హెలికాప్టర్లు.

రాఫెల్, మిగ్-29, సెఖోయ్-30 జాగ్వార్ యుద్ధ విమానాలు ఆపరేషన్ సిందూర్‌ను తలపించేలా స్పియర్‌హెడ్ ఆకృతిలో ఒళ్లు గగ్గుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించాయి.

కర్తవ్య పథ్‌లో కవాతు చేసిన 30 శకటాలు దేశ సాంస్కృతిక ఘనతకు, వైవిధ్యానికి అద్దం పట్టాయి. వీటిలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవి 17 కాగా, 19 కేంద్ర ప్రభుత్వ శాఖలు, త్రివిధ దళాలకు చెందినవి.

రక్షణ పాటవానికి అద్దం: మోదీ

గణతంత్ర వేడుకలు భారత రక్షణ పాటవానికి అద్దం పట్టాయని మోదీ పేర్కొన్నారు. మన సన్నద్ధతకు, సాంకేతిక సామర్థ్యానికి, పౌరుల భద్రత పట్ల తిరుగులేని చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచాయని ఎక్స్ పోస్టులో ఆయన హర్షం వెలిబుచ్చారు.

"ఈ వేడుకల్లో ఈయూ అధినేతలకు ఆతిథ్యమివ్వడం భారత్‌కు గొప్ప గౌరవం. నానాటికీ బలపడుతున్న భారత్, ఈయూ బంధానికి ఇది అద్దం పట్టింది"అన్నారు.

ఎన్నెన్నో 'తొలి'ఘనతలు!

ఈ గణతంత్ర వేడుకలు పలు 'తొలిసారి'ఘనతలకు వేదికగా నిలిచాయి...

కొత్తగా ఏర్పాటైన పదాతి దళ భైరవ్ లైట్ కమెండో బెటాలియన్, శక్తిబాణ్ రెజిమెంట్, సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థ వంటివెన్నో వీటిలో ఉన్నాయి. శక్తిబాణ్‌ను డ్రోన్, కౌంటర్ డ్రోన్ రెజిమెంట్‌గా తీర్చిదిద్దారు.

రెండు మూపురాల బ్యాక్ట్రియన్ ఒంటెలు, జన్‌స్కార్ అశ్వాలు తొలిసారి పరేడ్‌లో పాలు పంచుకున్నాయి.

61వ అశ్వికదళ సభ్యులు కూడా తొలిసారి కవాతులో పాల్గొన్నారు.

లద్దాఖ్, డోగ్రా, అరుణాచల్, కుమాయూన్, ఘఢ్వాల్, సిక్కిం స్కౌట్స్ సభ్యులతో కూడిన మిశ్రమ స్కౌట్స్ దళం కూడా సైనిక దుస్తుల్లో తొలిసారిగా అలరించింది.

డీఆర్‌డీవో రూపొందించిన నౌకా విధ్వంసక హైపర్‌సోనిక్ క్షిపణి ఎల్ఆర్-ఏఎస్‌హెచ్‌ఎం కూడా తొలిసారి పరేడ్‌లో పాల్గొంది.

రీమౌంట్ వెటర్నరీ కార్ప్స్ తరఫున సైనిక శునకాలు, డేగలు కూడా ఈసారి పరేడ్‌లో భాగస్వాములు కావడం విశేషం.

సుదర్శన చక్ర ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో సాగిన కవాతుకు మహిళా సైనికాధికారి సారథ్యం వహించారు.

ఈయూ సైనిక దళాలు

ఈసారి గణతంత్ర కవాతులో యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనిక దళాలు కూడా పాల్గొనడం విశేషం. ఈయూ సైనిక పతాకతో పాటు ఆపరేషన్ అట్లాంటా, ఆస్పిడెస్ నేవీ ఆపరేషన్ల తాలూకు పతకాలతో అలరించాయి. యూరప్ బయట ఇలాంటి వేడుకల్లో ఈయూ దళాలు పాల్గొనడం ఇదే తొలిసారి!

నారీ శక్తిని చాటిన సిమ్రన్

సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాల ఈసారి గణతంత్ర పరేడ్‌లో నారీ శక్తికి ప్రతీకగా నిలిచారు. పూర్తిగా పురుషులతో కూడిన 147 మంది సభ్యుల సీఆర్పీఎఫ్ దళానికి ఆమె సారథ్యం వహించి చరిత్ర సృష్టించారు. 'దేశ్ కే హమ్ రక్షక్'గీతం నేపథ్యంలో వినిపిస్తుండగా ఆమె నాయకత్వంలో సీఆర్పీఎఫ్ దళం కవాతు సాగింది. గణతంత్ర వేడుకల్లో పూర్తిగా పురుషులతో కూడిన సైనిక దళానికి మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించడం ఇదే తొలిసారి. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాకు చెందిన 26 ఏళ్ల సిమ్రన్ గతేడాదే సీఆర్పీఎఫ్‌లో చేరారు. ఆ జిల్లా నుంచి ఆఫీసర్ హోదాలో అందులో చేరిన తొలి మహిళ కూడా ఆమే కావడం విశేషం. సిమ్రన్ స్వగ్రామం నౌషేరా నియంత్రణ రేఖకు కేవలం 11 కి.మీ. దూరంలోనే ఉంటుంది. ఆమె తాత కూడా సైన్యంలో పని చేశారు.

ఆకట్టుకున్న మోదీ తలపాగా

గణతంత్ర వేడుకల్లో ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణీయమైన తలపాగా అందరినీ ఆకట్టుకుంది. ఈసారి ఆయన బంగారు జరీతో నేసిన నెమలీక ముద్రలతో కూడిన ముదురు ఎరుపు రంగు, పసుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన తలపాగా ధరించారు. ముదురు నీలం, తెలుపు రంగుల కుర్తా పైజామా, తేల నీలం రంగు హాఫ్ జాకెట్ ధరించారు. పదేళ్లకు పైగా పంద్రాగస్టు, గణతంత్ర వేడుకల్లో మోదీ రంగుల తలపాగాలు ధరిస్తూ వస్తుండటం తెలిసిందే. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్ కూడా భారత సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. సాధారణ ప్యాంటు, సూటుకు బదులుగా ఆమె ముదురు ఎరుపు, బంగారు రంగులతో కూడిన పట్టు బంద్‌గలా ధరించారు.

నదుల పేర్లు

ఈసారి గణతంత్ర వేడుకల్లో ఆహూతుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లకు ఈసారి వీవీఐపీ, వీఐపీ వంటి పేర్లకు బదులుగా నదుల పేర్లు పెట్టడం విశేషం. బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్, చీనాబ్, గండక్, గంగా, ఘగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోసీ, కృష్ణ, మహానది, నర్మద, పెన్నా, పెరియార్, రావి, సోన్, సట్లెజ్, తీస్థా, వైగై, యమున పేర్లతో ఎన్‌క్లోజర్లను రూపొందించారు. జనవరి 29న రాష్ట్రపతి కార్యాలయంలో జరిగే బీటింగ్ రిట్రీట్ వేడుకకు కూడా ఆహూతుల ఎన్‌క్లోజర్లకు వినూత్నంగా వేణువు, దమరుకం, ఎక్‌తారా, మృదంగం, నగాడా, పఖావజ్, సంతూర్, సారంగి, సరోద్, షెహనాయ్, సితార్, తబలా, వీణ వంటి భారత సంప్రదాయ సంగీత వాయిద్యాల పేర్లు పెట్టనున్నారు.

వందేమాతరం స్ఫూర్తి

ఈసారి వేడుకల్లో వందేమాతరం థీమ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఆ గేయంలోని తొలి చరణాలకు అద్దం పట్టే తేజేంద్రకుమార్ మిత్రా వంటి కళాకారుల పురాతన పెయింటింగుల నమూనాలను ఆహూతుల ఎన్‌క్లోజర్లపై ప్రదర్శించారు. జాతీయోద్యమంలో దేశమంతటా స్ఫూర్తి నింపిన ఈ గేయ రచనకు ఈ సంవత్సరమే 150 ఏళ్లు నిండటం తెలిసిందే. ఆ సందర్భంగా '150 ఏళ్ల వందేమాతరం'థీమ్‌కు గణతంత్ర వేడుకల్లో ప్రాధాన్యం దక్కింది. ఆహ్వానపత్రికల నుంచి పరేడ్ల దాకా అన్నింట్లోనూ వందేమాతరం లోగో దర్శనమిచ్చింది.









## తెలంగాణ రైజింగ్: సంక్షేమంతో సమగ్ర అభివృద్ధి



ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి

ప్రభుత్వం సేద్యానికి 24 గంటల విద్యుత్తును సరఫరా చేస్తోంది. రూ.20,617 కోట్ల వ్యయంతో రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేయడం ద్వారా 26 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చింది. రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు అందించే సహాయాన్ని నిరుడు రూ.10,000 నుంచి రూ.12,000కు పెంచింది. సన్నధాన్యంపై క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో 14.24 లక్షల మంది రైతుల నుంచి 72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఇప్పటివరకు రూ.17,079.50 కోట్ల చెల్లింపులు జరిగాయి. అదనంగా రూ.1,453 కోట్లను బోనస్‌గా పంపిణీ చేసింది. వరి ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు బియ్యాన్ని ఎగుమతి చేస్తూ... అంతర్జాతీయ మార్కెట్లలోనూ తన ఉనికిని చాటింది. ధరణి పోర్టల్ స్థానంలో రైతులకు అనుకూలమైన 'భూభారతి'ని తీసుకొచ్చింది.

యువత ఉపాధిపై దృష్టి

ఇప్పటివరకు 62,749 మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్)ను ప్రారంభించింది. యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించింది. ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేస్తోంది. మొత్తంగా తెలంగాణను ప్రపంచ నైపుణ్య రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోంది.

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇందిరా మహిళాశక్తి మిషన్‌ను అమలు చేస్తోంది. వారి ఆర్థిక కార్యకలాపాలకు మద్దతుగా రూ.40,000 కోట్ల రుణాలకు బ్యాంకులతో అనుసంధానం కల్పించింది. స్వయం సహాయక సంఘాలకు 236 ఇందిరా మహిళా శక్తి కాంటీన్లు, నారాయణపేట, సంగారెడ్డిలలో పెట్రోల్‌బంక్‌లను కేటాయించింది. రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తూ 42.90 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. గృహజ్యోతి ద్వారా 53 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తూ రూ.3,593 కోట్ల సబ్సిడీ ఇచ్చింది. ఇప్పటివరకు వైద్యారోగ్య రంగంలో రూ.16,521 కోట్లు వెచ్చించింది.

ఎస్సీ వర్గీకరణ అమలు

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల, ఉద్యోగ సర్వేను విజయవంతంగా నిర్వహించింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలుచేసి దేశానికి ఆదర్శంగా నిలిచింది. సమగ్ర పట్టణాభివృద్ధికి జీహెచ్‌ఎంసీని విస్తరించి 27 మున్సిపాలిటీలను విలీనం చేసింది. కాలుష్య నియంత్రణకు ఈవీలకు 100% పన్నుల్లో మినహాయింపు ఇస్తోంది. రాజ్యాంగం మనకు హక్కులతోపాటు బాధ్యతలనూ కల్పించింది. బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడమే రాజ్యాంగ నిర్మాతలకు మనమందించే నిజమైన నివాళి. ప్రజలు శాంతి, గౌరవం, సౌభాగ్యంతో జీవించాలి" అని ఆకాంక్షించారు.

# సిద్ధిక్ నగర్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ప్రభుత్వ పాఠశాలకు టీవీని అందజేసిన ఆంజనేయులు సగర**

శేరిలింగంపల్లి నియోజకవర్గం అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్ లో సోమవారం భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు డివిజన్ నాయకుడు ఏం. ఆంజనేయులు సగర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల ఆన్ లైన్ తరగతులకు ఉపయోగపడే విధంగా సిద్ధిక్ నగర్ ప్రభుత్వ పాఠశాలకు టీవీని అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సగర మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుల ఆశయాలకు అనుగుణంగా నేటి యువత పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రదోపాధ్యాయురాలు బాలమణి, ఉపాద్యాయులు రవీందర్, రజిని, మాధవి, రంగనాథ్, స్థానిక నాయకులు చందు, దిలీప్, గాలిరెడ్డి, కర్నూల్ రాజు తదితరులు పాల్గొన్నారు.




ప్రభుత్వ పాఠశాలకు టీవీని అందజేస్తున్న ఆంజనేయులు సగర



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విద్యార్థులతో కలిసి ఆంజనేయులు తదితరులు

# మహనీయుల అడుగుజాడల్లో నేటి యువత పయనించాలి
## మాజీ కార్పొరేటర్ సాయిబాబా



ఖాజాగూడలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సాయిబాబా



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న దృశ్యం

**గచ్చిబౌలి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండాను బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలను సాయిబాబా హాజరై ఎగురవేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం మనకు భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందన్నారు. ప్రతి పౌరుడు సామరస్యంతో జీవించడానికి మన రాజ్యాంగం పునాది వేసిందని, ఇంతటి గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందించిన మహనీయుల అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని సూచించారు. దేశ ప్రజలంతా ఐకమత్యంతో సుసంపన్నమైన భారతదేశం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# నల్లగండ్ల డివిజన్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని నల్లగండ్ల డివిజన్ లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండాలను గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి మాజీ వార్డు సభ్యులు రాగం జంగయ్య యాదవ్, రాగం హరి శంకర్ యాదవ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ఎంతోమంది మహానుభావులు ప్రాణాలను త్యాగం చేశారని, మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ నేటి యువత వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకరి రాజు ముదిరాజ్, చిన్నం రాజు,దార్గుపల్లి పరమేష్, చెన్నం రాజు ముదిరాజ్, బిక్షపతి యాదవ్, నరేష్ యాదవ్, తిరుమలేష్, రాణి, నారాయణ, వెంకట్ రెడ్డి, బాలకృష్ణ, ఇరగ దిండ్ల నరసింహ, కృష్ణారావు, జ్ఞానేశ్వర్, నాయక్, రాజు ముదిరాజ్,గడ్డం రాము, పల్లపు రాజు, గడ్డం పరశురాం, సురేష్, శ్రీను, నరేష్, స్వాతి, దుర్గుపల్లి చందన్, శ్రీనివాస్ యాదవ్, మహేష్, అనిల్, పరేష్, పద్మారావు, సంతోష్, మల్లేష్, యాదయ్య, గద్దర్ రాజు, భీమ్రాజ్, శ్యామ్, రవి తదితరులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు జంగయ్య యాదవ్, హరిశంకర్ యాదవ్ తదితరులు

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
## కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



వార్డు కార్యాలయంలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గంగాధర్ రెడ్డి

**గచ్చిబౌలి వార్డు కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ లో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి వార్డు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండాను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన, ప్రాణత్యాగం చేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డివిజన్ పరిధిలోని నానక్ రాంగూడ బీజేపీ కార్యాలయంలో, నల్లగండ్ల ప్రభుత్వ పాఠశాల, గోపన్ పల్లి, కేశవ్ నగర్, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాలను కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ భారతరత్న, దేశ రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటితో 77 ఏళ్లు పూర్తవుతుందని అన్నారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు అనే ఆయుధాన్ని కల్పించి అర్హులైన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకొనే గొప్ప అవకాశం ఇచ్చింది అంబేద్కర్ రచించిన రాజ్యాంగమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ లోనీ రాష్ట్ర, జిల్లా, సీనియర్ నాయకులు, డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గౌతమి నగర్ లో జాతీయ జెండాను ఆవిష్కరించిన
## కసిరెడ్డి భాస్కర్ రెడ్డి



గౌతమి నగర్ లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి

ఈకబురు, శేరిలింగంపల్లి : చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను బిజెపి రాష్ట్ర నాయకులు, జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం గచ్చిబౌలి డిఎల్ఎఫ్ వద్ద స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎగురవేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుల అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవం మనకు భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# భారత్ ఈయూ వాణిజ్య ఒప్పందం వేళ..
## అమెరికా కీలక వ్యాఖ్యలు

ఈకబురు,భారత్, యురోపియన్ యూనియన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (India EU FTA) కొలిక్కి వచ్చిన వేళ.. అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ''రష్యా (Russia) నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకాలను విధించాం. కానీ.. ఏం జరిగిందో చూశారా? యురోపియన్లు భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. రష్యన్ చమురు తొలుత భారత్‌కు వెళ్తోంది. అక్కడి నుంచి శుద్ధి చేసిన చమురు ఉత్పత్తులు బయటకు వస్తున్నాయి. వాటిని ఐరోపావాసులు కొనుగోలు చేస్తున్నారు. తద్వారా తమపై యుద్ధానికి తామే నిధులు సమకూరుస్తున్నారు'' అని బెసెంట్ పేర్కొన్నారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) నాయకత్వంలో ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి తెరపడుతుందని బెసెంట్ ధీమా వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారం చూపేందుకు ట్రంప్ కృషి చేస్తున్నారని, ఈ వ్యవహారంలో ఐరోపా దేశాల కంటే అమెరికానే చాలా పెద్ద త్యాగాలు చేసిందని చెప్పారు. అయితే, ఆ త్యాగాలేంటో ఆయన వెల్లడించలేదు.

**అమెరికా సరిహద్దుల్లో.. రోజుకు 65 మంది భారతీయులు అరెస్ట్**

భారత్‌పై అమెరికా (USA) విధించిన సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉన్నట్లు బెసెంట్ ఇటీవల సూచనప్రాయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. ''రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించుకుంది. అది భారీ విజయం. చమురు విషయంలో ఇప్పటికీ టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి. వాటిని తొలగించడానికి ఒక మార్గం ఉందని అనుకుంటున్నాను'' అని సుంకాల తొలగింపు గురించి పరోక్షంగా వెల్లడించారు.

**'చర్చలు విజయవంతంగా ముగిశాయి'..**

ఈయూతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై చర్చలు విజయవంతంగా ముగిసినట్లు వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ఈమేరకు ఒప్పందం ఖరారైనట్లు ఆదివారం వెల్లడించారు. ఇరువైపులా వాణిజ్యాన్ని మరింత పెంచేందుకు, ఆర్థిక సంబంధాల బలోపేతానికి ఇది దోహదపడుతుందన్నారు. భారత్ కోణం నుంచి ఈ ఒప్పందం సమతుల్యంగా, దూరదృష్టితో కూడి ఉందని చెప్పారు.

## 5 రంగాల్లో రూ.50.6 లక్షల కోట్లు



అభివృద్ధి చెందుతున్న దేశాలు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను గణనీయ స్థాయిలో వినియోగిస్తున్నాయని కన్సల్టింగ్ సంస్థ పీడబ్ల్యూసీ తెలిపింది. 'ఏఐ ఎడ్జ్ ఫర్ వికసిత్ భారత్' పేరుతో ఈ నివేదికను సంస్థ విడుదల చేసింది. దీని ప్రకారం 2035 నాటికి మనదేశంలో 5 ప్రాధాన్యతా రంగాల్లో ఏఐ వాటా 550 బిలియన్ డాలర్ల (రూ.50.6 లక్షల కోట్ల)కు చేరుతుందని అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం..

వ్యవసాయంలో

దేశంలో ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఇంధనం, విద్య, తయారీ రంగాల వృద్ధిలో ఏఐ కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోంది. వ్యవసాయం మనదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే, ఈ రంగం స్థూల విలువ జోడింపు (జీవీఏ) 204647 ఆర్థిక సంవత్సరం నాటికి 2,359 బిలియన్ డాలర్ల (సుమారు రూ.217 లక్షల కోట్ల)కు చేరాల్సిన అవసరం ఉంది. 202425 ఆర్థిక సంవత్సరంలో ఇది 637 బి.డాలర్లు (సుమారు రూ.58.60 లక్షల కోట్లు)గా ఉంది. ఈ రంగం తీవ్రమైన ఉత్పాదకత సవాళ్లను ఎదుర్కొంటోంది. భారతీయ రైతుల్లో సుమారు 86% మంది చిన్న లేదా సన్నకారు రైతులే ఉన్నారు. వీరు ఒక హెక్టారు కంటే తక్కువ భూమి కలిగి ఉన్నారు. వ్యవసాయ దిగుబడులు మెరుగుపర్చడానికి, వ్యవసాయంలో దీర్ఘకాలిక స్థిరత్వాన్ని తీసుకురావడానికి డిజిటల్ సాధనాలను ముఖ్యంగా ఏఐని వేగంగా స్వీకరించడం ఈ రంగానికి చాలా అవసరమని నివేదిక తెలిపింది.

ఇంధన రంగంలో

తయారీ, వ్యవసాయం రెండింటిలోనూ వృద్ధికి ఇంధన రంగాన్ని కీలకమైన సహాయకారిగా అభివర్ణించారు. పారిశ్రామిక విస్తరణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మద్దతు ఇస్తున్నందున, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడానికి సమర్థ, ఉత్పాదక ఇంధన వ్యవస్థ కీలకంగా ఉండనుంది.

వైద్య సేవల్లో

జిల్లా ఆసుపత్రులకు అనుసంధానించిన వైద్య కళాశాలల ద్వారా తృతీయ, సూపర్ స్పెషాల్టీ కేర్‌ను విస్తరించడం వల్ల అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను సృష్టించొచ్చు. వైద్య ప్రతిభను నిలుపుకోవడంలో కూడా సహాయపడొచ్చు. ఇది వైద్య పర్యాటకానికీ దోహదపడుతుంది. రోగ నిర్ధారణ సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో ఏఐ సాయపడుతుంది.

తయారీ ప్రక్రియలో

తయారీరంగంలో సెమీ కండక్టర్లు, సోలార్ ప్యానళ్లు, టెలికమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో వేగవంత వృద్ధికి ఏఐ ఉపయోగపడుతుంది. ప్రపంచ వాల్యూ చైన్‌లలో భారత్ పాత్రనూ పెంచుతుంది.

విద్యా బోధనలో

విద్యాబోధనలో నాణ్యత పెంచడం, పాలన, నైపుణ్య అమరికను మెరుగపర్చడంలో ఏఐ సాయపడుతుంది. విద్యార్థులు మరింతగా ఉపాధి పొందేందుకు సహకరిస్తుంది.

ఏఐ ఎడ్జ్ ఫ్రేమ్ వర్క్‌ను కూడా నివేదిక వివరించింది. దేశ అభివృద్ధికి ఏఐని అనుసంధాన వ్యవస్థగా మార్చడానికి రూపొందించిన 3ఏ2ఐ ఫ్రేమ్‌వర్క్‌ను పీడబ్ల్యూసీ తన నివేదికలో ప్రవేశపెట్టింది. ఇందులో మన దేశం ఏఐ స్వీకరణ నుంచి ఆశించే 5 ఫలితాలను తెలిపింది. వీటిలో కార్యాచరణ నైపుణ్యం, స్థిరత్వం, మంచి పాలన, స్థితిస్థాపకత, ఆర్థిక క్రమశిక్షణ ఉన్నాయి.

## బడ్జెట్‌కు ముందైనా.. పరుగుపెట్టేనా

నష్టాల బాటలో పయనిస్తున్న మన స్టాక్ మార్కెట్.. బడ్జెట్‌కు ముందైనా పుంజుకుంటుందేమోనని మదుపర్లు ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే 202627 బడ్జెట్‌లో, మార్కెట్‌కు మద్దతునిచ్చే నిర్ణయాలు ఉండొచ్చనే ఆశలతో.. సాధారణంగా మదుపర్లు బడ్జెట్‌కు ముందు రోజుల్లో కొనుగోళ్లకు మొగ్గుచూపుతుంటారు. ఇటీవలి కొన్ని సంవత్సరాల్లో ఇదే ధోరణి కనిపించింది. ఈసారి కూడా అదే పరిస్థితి కొనసాగొచ్చేమో అనే ఆశాభావం ఉంది. ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు సెన్సెక్స్, నిఫ్టీ 4 శాతానికి పైగా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, బలహీన రూపాయి, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు స్తబ్దుగా ఉండటం, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, సుంకాల ఆందోళనలు ఇందుకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రి బడ్జెట్ ర్యాలీ చోటుచేసుకుంటే.. మదుపర్లకు కొంతయినా ఊరటనిచ్చే పరిణామం కావచ్చు.

గత సందర్భాల్లో ఇలా..

'గతంలోనూ జనవరిలో స్టాక్ మార్కెట్లు నష్టాలనే నమోదుచేశాయి. బడ్జెట్‌పై ఆశలతో, గణతంత్ర దినోత్సవం (జనవరి 26) తర్వాత పుంజుకునేవ'ని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్‌లో రీసెర్చ్ హెడ్‌గా ఉన్న సంతోశ్ మీనా చెబుతున్నారు. 2025 జనవరిలోనూ బీఎస్ఈ 638.44 పాయింట్లు (0.81%) నష్టపోయింది. 2024, 2023, 2022, 2021, 2020 జనవరి నెలల్లో ఇదే పరిస్థితి పునరావృతమైంది.

**రూపాయిపైనా ఒత్తిడి..**

ఈ నెలలో దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు భారీగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. జనవరి 23తో ముగిసిన వారంలో విక్రయాలను మరింతగా పెంచారు. ఈ పరిణామం ఒత్తిడిని పెంచడంతో, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ రికార్డు కనిష్ఠాలకు పడిందని ఆన్‌లైన్ ట్రేడింగ్ సంస్థ ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ తెలిపారు. డాలరు విలువ జనవరి 23న రూ.92 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. ఈ నెలలో ఇప్పటివరకు రూపాయి విలువ 2% తగ్గింది.

అంతర్జాతీయ విపణుల్లో ముడి చమురు ధరలు, అమెరికా బాండ్ల ప్రతిఫలాలు పెరగడం వల్లా, మదుపర్లలో అప్రమత్తత పెరిగింది. దీంతో రక్షణాత్మక వైఖరి అవలంబిస్తూ, సురక్షిత పెట్టుబడి సాధనాలైన పసిడి, వెండిలోకి పెట్టుబడులను మళ్లిస్తున్నారు. ఈ పరిణామంతో ఈ లోహాల ధరలు భారీగా పెరుగుతున్నాయి.

ఐటీ, బ్యాంకింగ్, వినియోగ ఆధారిత రంగాల్లోని కొన్ని కీలక కంపెనీల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు నిరుత్సాహపర్చడమూ మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

**బడ్జెట్‌పై అంచనాలు**

అంతర్జాతీయ అనిశ్చితుల దృష్ట్యా వృద్ధికి తోడ్పాటు, సూక్ష్మ ఆర్థిక స్థిరత్వం మధ్య సమతూకం పాటించేలా 202627 వార్షిక బడ్జెట్లో నిర్ణయాలు ఉండొచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ నివేదిక తెలిపింది. మధ్యకాలానికి ద్రవ్యస్థిరీకరణ విషయంలోనూ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడకపోవచ్చని పేర్కొంది. మార్కెట్లు ఈసారి బడ్జెట్ నుంచి ఇలాంటి నిర్ణయాలనే కోరుకునే అవకాశం ఉందని అభిప్రాయపడింది. మూలధన లాభాల పన్నుపై ఆశాజనక నిర్ణయాలు ఉంటాయని ఆశిస్తున్నారు.

**2026 జనవరిలో ఇప్పటివరకు గతవారంలో**

**సెన్సెక్స్ -3683 పాయింట్లు (4.32%) -2,033 (2.43%)**

**నిఫ్టీ -1081 పాయింట్లు (4.13%) -646 (2.51%)**



## బంగారు కొండ మరింత ఎత్తుకు

అంతర్జాతీయ విపణిలో మేలిమి బంగారం ఔన్సు (31.10 గ్రాముల) ధర తొలిసారిగా 5,000 డాలర్లను అధిగమించింది. రెండేళ్లలోనే ఈ ధర రెట్టింపునకు మించడం బులియన్ వర్గాలనే ఆశ్చర్య పరుస్తోంది. అనిశ్చితుల్లో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారంపైకి పెట్టుబడులు రావడం, ఫలితంగా ధర పెరగడం సహజంగానే జరుగుతుంటుంది. అయితే ఈసారి పెరిగినంత వేగంగా పసిడి ధర మునుపెన్నడూ దూసుకెళ్లలేదని చెబుతున్నారు. ఇదేక్రమంలో ఔన్సు వెండి ధర కూడా 100 డాలర్లను మించి కదలాడుతోంది.

ఇవీ కారణాలు

రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం నుంచి బంగారం, వెండిపైకి పెట్టుబడులు పెరుగుతూ వస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్, వివిధ దేశాల ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలతో పాటు వెనెజువెలా, ఇరాన్, గ్రీన్‌లాండ్ వ్యవహారాల్లో ప్రదర్శిస్తున్న దూకుడు వల్ల వాణిజ్య యుద్ధ భయాలు అధికమవ్వడం.. బంగారం ధరలకు మద్దతిస్తోంది. సార్వభౌమ బాండ్లతో పాటు కరెన్సీ మార్కెట్ల నుంచీ పెట్టుబడులు లోహాలపైకి వస్తున్నాయి. గతవారంలో జపాన్ బాండ్ మార్కెట్లో గణనీయ అమ్మకాలు వచ్చాయి.

కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రభుత్వాల రుణాలు గణనీయ స్థాయిలకు చేరాయి. ఇవి కూడా మదుపర్లలో ఆందోళనను పెంచుతూ, వారు ఈక్విటీ మార్కెట్ల నుంచి లోహాలవైపు వచ్చేందుకు కారణమవుతున్నాయి.

అమెరికా డాలర్ విలువ కూడా కొన్ని కరెన్సీలతో పోలిస్తే గతవారంలో అధికంగా బలహీనపడింది. గత మే నెల తరవాత, ఇలా జరగడం ఇప్పుడే. ఫలితంగా ఆయా దేశస్తులు, బంగారాన్ని తక్కువ మొత్తంతోనే కొనగలిగారు.

గతేడాదిలో 65% వరకు ప్రతిఫలాన్ని అందించిన పసిడి, కొత్త సంవత్సరంలో ఇప్పటికే 15% రాణించింది.

2000 సంవత్సరం నుంచి 1600% ప్రతిఫలం

బంగారంపై పెట్టుబడులు పెట్టినవారికి 2000 సంవత్సరం నుంచే ఇప్పటికి 1600% ప్రతిఫలం లభించిందని అంచనా. వివిధ దేశాల కేంద్రీయ బ్యాంకులు కూడా, విదేశీ మారకపు ద్రవ్యంలో పసిడి వాటాను పెంచుకుంటూ పోవడమూ, ఈ లోహం ధర అందనంత ఎత్తుకు చేరేందుకు కారణమవుతోంది. 2024 వరకు వివిధ దేశాల విదేశీ మారకపు ద్రవ్యం విలువ 4 లక్షల కోట్ల డాలర్లుగా ఉండగా, అధికారిక పసిడి నిల్వల విలువ 23 లక్షల కోట్ల డాలర్లుగా నిలిచింది. గతేడాదిలో ఇది మారి, బంగారం విలువ దూసుకెళ్లడం ప్రారంభించి, ప్రస్తుతం 5 లక్షల కోట్ల డాలర్లకు చేరిందని బ్లూమ్‌బర్గ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేంద్రీయ బ్యాంకులు గతేడాది తొలి 9 నెలల్లో 634 టన్నుల బంగారాన్ని కొన్నాయని, ఏడాది ముగిసేసరికి ఇది 900 టన్నులకు చేరి ఉంటుందనే అంచనాలున్నాయి. అంటే డాలర్‌కు బదులుగా, విదేశీ మారకపు ద్రవ్యంగా పసిడిని పోగుచేసుకుంటున్నాయి.

సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడి ఎందుకంటే..

ఒక దేశ, ప్రపంచ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా బంగారం ధర తగ్గే పరిస్థితి రాలేదు. ఇతర పెట్టుబడి సాధనాలపై అధిక ప్రతిఫలం లభించినప్పుడే, ఈ లోహం నుంచి పెట్టుబడులు తరలి వెళ్తుంటాయి. ఒక కంపెనీ/ప్రభుత్వాలు జారీ చేసే ఈక్విటీలు/బాండ్ల పరిస్థితికి ఇందుకు భిన్నంగా ఉంటుంది. వాటి స్థితి మెరుగ్గా ఉంటేనే, లాభాలొస్తాయి.

అమెరికాలో వడ్డీరేట్లు ఇంకా తగ్గే పరిస్థితి ఉందని అంచనా. ఆ దేశ కేంద్రబ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ పదవికి కొత్త వ్యక్తిని ఎంపిక చేసే ప్రక్రియలో ట్రంప్ ఉన్నారు. వడ్డీరేట్లు తగ్గించాలనే ట్రంప్ కోరుకుంటారు కనుక, అది నెరవేర్చే వ్యక్తినే ఎంపిక చేయొచ్చు. వడ్డీరేట్ల తగ్గితే, బాండ్లపై ప్రతిఫలం పరిమితమవుతుంది. ఇది బంగారానికి కలిసి వస్తుంది.

సరఫరా ఎంత ఉంటుంది?

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 2,16,265 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసి ఉంటారన్నది ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా. ఇంకా 64,000 టన్నుల బంగారం భూమిలో ఉందన్నది యూఎస్ జియొలాజికల్ సర్వే అంచనా. మనదేశంలో చూస్తే ప్రతి శుభకార్యానికి బంగారం కొనడం అనేది సంప్రదాయంగా వస్తోంది. మనదేశంలోని గృహస్థుల వద్ద 3.8 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.350 లక్షల కోట్ల) బంగారం ఉందని మోర్గాన్‌స్టాన్లీ అంచనా వేసింది. దేశ జీడీపీలో 89 శాతానికి ఇది సమానమనీ పేర్కొంది. చైనాలో కేంద్రీయ బ్యాంకుతో పాటు ప్రజలు కూడా బంగారాన్ని అధికంగా కొంటున్నారు. ఇవన్నీ పసిడి ధరలు పెరిగేందుకు కారణమవుతున్నాయి.

అంచనాలు ఎలా ఉన్నా..

బంగారం ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే ఆర్థిక స్థోమతను గమనించుకుంటూ, ఈ పెట్టుబడులపై ముందుకు సాగాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. దేశీయంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ఇక్కడ 9% వరకు పన్నులు+సుంకాలు పడుతున్నందున, అంతర్జాతీయ విపణితో పోలిస్తే, ఇక్కడ బంగారం ధర అధికంగా ఉంటుంది.



## 2026-27: నిర్మలమ్మ పద్దు.. లెక్కలేసింది వీళ్లే..!




**మరికొద్ది రోజుల్లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వరుసగా తొమ్మిదోసారి ఆర్థిక పద్దు (Budget 2026-27)ను ప్రవేశపెట్టి.. మాజీ మంత్రి పి.చిదంబరం రికార్డును సమం చేయనున్నారు. ఫిబ్రవరి 1న లోక్‌సభ వేదికగా ఆమె చేయబోయే బడ్జెట్ ప్రకటనలపై యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ప్రధాని మోదీ మూడో హయాంలో ప్రవేశపెట్టనున్న మూడో పూర్తిస్థాయి బడ్జెట్ (Union Budget) ఇది. ఈ సందర్భంగా కేంద్ర పద్దు లెక్కలేసిన నిర్మలమ్మ (Nirmala Sitharaman) టీమ్ ఎవరో చూద్దాం..!**

అనురాధ ఠాకూర్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి: బడ్జెట్ రూపకల్పనలో ప్రధాన అధికారి ఈమెనే. 202627 సంవత్సరానికి వనరుల కేటాయింపుతో స్థూలఆర్థిక ఫ్రేమ్‌వర్క్‌ను ఈమే నిర్ణయిస్తారు. బడ్జెట్ డాక్యుమెంట్లను సిద్ధం చేసే బడ్జెట్ డివిజన్‌కు నాయకత్వం వహిస్తారు. ఆర్థికశాఖ అధికారిగా అనురాధకు ఇదే తొలి బడ్జెట్. 1994 హిమాచల్ కేడర్ ఐఏఎస్ అధికారిణి అయిన అనురాధ.. గతేడాది జులైలో ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా బాధ్యతలు అందుకున్నారు. ఈ పదవి చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ ఈమే కావడం విశేషం.

అరవింద్ శ్రీవాత్సవ, రెవెన్యూ కార్యదర్శి: బడ్జెట్ ప్రసంగంలోని పార్ట్‌బిలో ఉండే పన్ను ప్రతిపాదనలను రూపొందించేది ఈయనే. ఆదాయ పన్ను, కార్పొరేట్ ట్యాక్స్ వంటి ప్రత్యక్ష పన్నులు, జీఎస్టీ, కస్టమ్స్ వంటి పరోక్ష పన్నుల లెక్కలన్నీ ఈయన బృందమే పర్యవేక్షిస్తుంది. రెవెన్యూ కార్యదర్శిగా అరవింద్‌కు ఇదే తొలి బడ్జెట్ అయినప్పటికీ.. ఆర్థిక మంత్రిత్వ శాఖలో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో ఆయన బడ్జెట్ డివిజన్‌కు జాయింట్ సెక్రెటరీగా వ్యవహరించారు. ఈసారి ఆర్థిక పద్దులో కస్టమ్స్ సుంకాలు, టీడీఎస్ హేతుబద్ధీకరణ వంటివి ఉండొచ్చన్న అంచనాలున్నాయి.

ఉమ్లున్‌మంగ్ వ్యూల్నామ్, ఎక్స్‌పెండిచర్ సెక్రెటరీ: కేంద్ర ప్రభుత్వ పర్స్‌కు ఈయనే గార్డియన్. ప్రభుత్వ వ్యయాలు, రాయితీ హేతుబద్ధీకరణ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను పర్యవేక్షిస్తారు. ద్రవ్య లోటును పరిమితం చేయడంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరానికి మార్గనిర్దేశనం చేయడం వంటివి ఉమ్లున్‌మంగ్ బృందం చూస్తుంది.

**ఎం. నాగరాజు, ఆర్థిక సేవల కార్యదర్శి:**

**ప్రభుత్వ ఆర్థిక సమ్మిళిత, సామాజిక భద్రతా పథకాలను అమలు బాధ్యతలను ఆర్థిక సేవల విభాగం చూసుకుంటుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీలు, పింఛను వ్యవస్థల ఆర్థిక పరిస్థితిని ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక అజెండాను ముందుకు తీసుకెళ్లడంలో ఈ విభాగానిదే కీలక పాత్ర.**

అరునిష్ చావ్లా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ సెక్రెటరీ

ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ వంటి వ్యవహారాలను ఈయన బృందమే పర్యవేక్షిస్తుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను విక్రయించడంతో వచ్చే పన్నేతర ఆదాయ లక్ష్యాలను అందుకోవడంలో ఈయన విభాగం కీలక పాత్ర పోషిస్తుంది.

కె. మోజస్ చాలై, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెక్రెటరీ

ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వ్యయ ప్రణాళికలను ఈయన విభాగమే పర్యవేక్షిస్తుంది. బడ్జెట్ కేటాయింపులు సమర్థవంతంగా వినియోగించేలా చూస్తారు. ఆస్తుల విక్రయం, ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక పరిస్థితిని సమీక్షించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది.

ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఈ విభాగాలతో పాటు ప్రధాన ఆర్థిక సలహాదారు కార్యాలయం కూడా బడ్జెట్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరిస్తుంది. ప్రస్తుతం వి. అనంత నాగేశ్వరన్ కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఉన్నారు. ఆర్థిక వృద్ధిని అంచనా వేయడం, రంగాల వారీగా పనితీరు, ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఆర్థిక సంక్షోభాలను అధ్యయనం చేయడం వంటివి ఈయన బృందం పరిశీలిస్తుంది. ఇక, ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ కూడా బడ్జెట్ రూపకల్పనలో భాగమవుతారు.

## సరికొత్తగా రెనో డస్టర్

రూ.21,000తో ప్రీ-బుకింగ్ ప్రారంభం

రెనో సంస్థ, మధ్యస్థాయి ఎస్‌యూవీ డస్టర్‌ను భారత విపణిలోకి సోమవారం మళ్లీ తీసుకొచ్చింది. మూడు ఇంజిన్ ఆప్షన్లలో ఇది లభ్యమవుతోంది. ఇందులో బలమైన హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ వేరియంట్ కూడా ఉంది. టర్బో టీసీఈ 160, 1.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ, 1.8 లీటర్ జీడీఐ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజిన్, టర్బో టీసీఈ 100 ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. గూగుల్ అసిస్టెంట్ ఇన్‌బిల్ట్‌గా ఉంది. ఎలక్ట్రిక్ టెయిల్ గేట్, 6-వే పవర్డ్ డ్రైవర్ సీటు, ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, అడాస్ ప్యాకేజ్, 360 డిగ్రీ కెమెరా వంటి సదుపాయాలున్నాయి. ఇందులో బూట్ స్పేస్ 700 లీటర్లు ఉండటం ప్రత్యేకత. సమీపంలోని ఎస్‌యూవీ కంటే ఈ బూట్ స్పేస్ 80 లీటర్లు ఎక్కువని కంపెనీ తెలిపింది. 'రెనో ఫరెవర్ ప్రోగ్రామ్' కింద 7 ఏళ్లు లేదా 1,50,000 కి.మీ. వరకు గరిష్ఠ వారెంటీ అందిస్తామని పేర్కొంది. ఆర్-పాస్ పేరుతో ప్రీ-బుకింగ్‌లను ప్రారంభించింది. రూ.21,000 చెల్లించి ఈ పాస్ తీసుకుంటే డస్టర్ ఎస్‌యూవీని ప్రత్యేక పరిచయ ధరకే అందిస్తామని వెల్లడించింది. మార్చి మధ్యలో ధరలు వెల్లడిస్తామని, ఏప్రిల్ మధ్య నుంచి డెలివరీలు ప్రారంభిస్తామని వివరించింది. హైబ్రిడ్ వేరియంట్ మాత్రం దీపావళికి వస్తుందని తెలిపింది. కొత్త రెనో డస్టర్ మార్కెట్లో కియా సెల్టోస్, హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా, మారుతీ సుజుకీ విక్టోరిస్, స్కోడా కుశాక్, ఫోక్స్‌వ్యాగన్ టైగన్‌లతో పోటీ పడబోతోంది.



## సైన్స్ ఫిక్షన్ సినిమాతో..



కథానాయకుడు నితిన్ కొత్త కబురు వినిపించారు. తన 36వ చిత్రం కోసం దర్శకుడు వీఐ ఆనంద్‌తో చేతులు కలిపారు. 'ఊరు పేరు భైరవకోన' విజయం తర్వాత ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. శ్రీనివాస చిట్టూరి నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని రథ సప్తమి సందర్భంగా ఆదివారం అధికారికంగా ప్రకటించారు. "ఇదొక వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ ఎంటర్‌టైనర్. సినీప్రియులకు ఇప్పటి వరకు చూడని విధంగా సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించేలా ఉంటుంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ మొదలవుతుంది. మరిన్ని వివరాలు త్వరలో ప్రకటిస్తాం" అని చిత్ర బృందం తెలిపింది.

## ఆ రెండింటి తర్వాతేనా!



కథానాయకుడు అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఇది పూర్తి చేసిన వెంటనే లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఇప్పడీ లైనప్‌లోకి సందీప్ రెడ్డి వంగా సినిమా కూడా చేరింది. నిజానికి వీళ్లిద్దరి కలయికలో ఓ చిత్రం రానున్నట్లు గతంలోనే అధికారికంగా ప్రకటించారు. కానీ, 'పుష్ప 2' తర్వాత అల్లు అర్జున్ ప్రణాళికలన్నీ మారడం.. మరోవైపు దీనిపై ఇటీవల కాలంలో ఏ అప్‌డేట్ రాకపోవడం.. సందీప్ కూడా 'స్పిరిట్' కోసం రంగంలోకి దిగిపోవడంతో సినీప్రియులంతా ఇక ఈ సినిమా ఉండకపోవచ్చనుకున్నారు. అయితే ఇప్పడీ ప్రాజెక్ట్‌పై నిర్మాత భూషణ్ కుమార్ స్వయంగా స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం తమ టీ సిరీస్ బ్యానర్‌లో దర్శకుడు సందీప్ రెడ్డితో 'స్పిరిట్', 'యానిమల్ పార్క్' సినిమాలతో పాటు అల్లు అర్జున్ చిత్రం చేయనున్నట్లు ప్రకటించారు. మరి భూషణ్ చెప్పినట్లు బన్నీ సినిమా ప్రభాస్, రణ్‌బీర్ చిత్రాలు పూర్తయిన వెంటనే పట్టాలెక్కుతుందా? లేదా? తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

# ఆ సన్నివేశం తర్వాత నిజంగానే ఏడ్చేశా!



ఎప్పట్నుంచో తాను ఎదురు చూస్తున్న పాత్ర ఈ సినిమాతో దొరికిందని, దాంతో ఇందులోని శాంతి పాత్రని వందశాతం మనసుపెట్టి చేశానన్నారు ఈషారెబ్బా. స్వతహాగా తనకు యాక్షన్ ప్రధానమైన సినిమాలంటే ఇష్టమనీ, ఈ సినిమాలోని యాక్షన్ కోణం కూడా తనకు ఎంతో తృప్తినిచ్చిందన్నారు. అచ్చ తెలుగు కథానాయికైన ఈషారెబ్బా ఇటీవల 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంలో నటించారు. ఇందులో తరుణ్‌భాస్కర్ కథానాయకుడు. ఎ.ఆర్.సజీవ్ దర్శకత్వం వహించారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణ, అనూప్ చంద్రశేఖరన్, సాథిక్ షేక్, నవీన్ శనివారపు నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా కథానాయిక ఈషారెబ్బా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"మంచి కథతో రూపొందిన సినిమా ఇది. మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహే' చిత్రానికి రీమేక్‌గా రూపొందింది. ఆ సినిమా చూడగానే కథ ఎంతగా నచ్చిందో, అందులో అమ్మాయి పాత్ర అంతకంటే బాగా నచ్చింది. అబ్బాయిలు, అమ్మాయిలు... అందరూ కనెక్ట్ అయ్యే బలమైన కథ. ఆలోచన రేకెత్తించే సందేశం ఉన్నా, అది కూడా హాస్యకోణంలోనే ఉండటం ఈ సినిమా ప్రత్యేకత. నేను శాంతి అనే యువతిగా కనిపిస్తా. కరోనా సమయంలో నేను నేర్చుకున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈ పాత్రకి బాగా పనికొచ్చింది".

"గోదావరి నేపథ్యంలో సాగే ఈ కథలో పాత్రలన్నీ ఆ యాసలో మాట్లాడుతుంటాయి. నేను పుట్టి పెరిగింది తెలంగాణలో అయినా, మా అమ్మ తరఫు బంధువులంతా రాజమండ్రికి చెందినవారే. అక్కడికి పండగలప్పుడు వెళ్లి వచ్చేదాన్ని. దాంతో నాకు ఆ యాస మాట్లాడటం పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. తరుణ్‌భాస్కర్ మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుని డబ్బింగ్ చెప్పారు. సినిమాలో చెంపదెబ్బకు సంబంధించిన సన్నివేశాలు చాలానే ఉంటాయని ముందే తెలుసు. అయితే చట్నీ అంటిన చేత్తో కొట్టే సన్నివేశంలో నిజంగానే గట్టిగా కొట్టారు తరుణ్ భాస్కర్. సన్నివేశం పండాలని, చట్నీ ముఖానికి అంటుకోవాలని దర్శకుడు నిజంగానే కొట్టమన్నారట. ఆ సన్నివేశంలో కనిపించే నా కన్నీళ్లు నిజమైనవే. సన్నివేశం పూర్తయ్యాక నిజంగానే ఏడ్చేశా".

"నా కెరీర్‌లో ఎక్కువ విరామం వచ్చింది ఈ సినిమాకి ముందే. అంతకుముందు చేసిన సినిమా సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. దాంతో ఆచితూచి కథలపై నిర్ణయం తీసుకున్నా. ఈ సినిమా ప్రయాణం సాగుతుండగా నా పెళ్లి గురించి సాగిన ప్రచారం నా దృష్టికి కూడా వచ్చింది. అయితే అందులో నిజం లేదు. మా నాన్న కూడా ఇదే అడిగారు. నేను ఒకరితో సన్నిహితమైన అనుబంధం కొనసాగిస్తున్న మాటైతే నిజం. పెళ్లిపై అయితే ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 'అంతకుముందు ఆ తరువాత' చేశాక ఈ అమ్మాయి ఇలాంటి సీరియస్ పాత్రలే చేస్తుందేమో అనుకున్నారు చాలా మంది. దాంతో 'అమీతుమీ' సహా చాలా సినిమాల్లో ఉత్సాహవంతమైన పాత్రలు చేశా. 'త్రీ రోజెస్' వెబ్‌సిరీస్ కూడా అదే తరహాలో సాగుతుంది. కొత్తగా రెండు కథలు విన్నా. తమిళంలో ఓ సినిమాలో నటిస్తున్నా".

## ఈ జాతీయ గౌరవం ఓ మైలురాయి



గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో తమకు పద్మ పురస్కారాలు రావడం పట్ల హీరో మమ్ముట్టి, నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వీళ్లంతా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు విడుదల చేశారు. "మాతృభూమికి నా కృతజ్ఞతలు. పద్మభూషణ్.. ఈ పౌర పురస్కారంతో నన్ను సత్కరించినందుకు దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని మమ్ముట్టి ఎక్స్‌లో పేర్కొన్నారు.

**లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా..**

"ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన పద్మ అవార్డు రావడం సంతోషంగా ఉంది. లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది. అన్నీ మనం అనుకున్నప్పుడే రావు. ఏదైనా ఎదురు చూపుల తర్వాత దొరికితే దానికి విలువ ఎక్కువ. ఇంత మంచి అవార్డును ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులందరికీ కృతజ్ఞతలు" అని మురళీ మోహన్ పేర్కొన్నారు.

**మర్చిపోలేని రోజు**

భారత ప్రభుత్వం తనకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం జీవితంలో మర్చిపోలేని రోజని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కళల్ని గౌరవించి, ఈ అవార్డుకు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేశారు. "48ఏళ్లుగా నేను ఏ వేషం వేసినా.. ఏ ప్రయోగం చేసినా ప్రేక్షకులు అందించిన ప్రేమే నాకు ఈరోజు ఇంతటి గుర్తింపు తెచ్చింది. ఈ రుణం ఎప్పటికీ తీర్చుకోలేను" అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

**పద్మశ్రీ విజేతలకు చిరు సన్మానం..**

నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ పురస్కారాలు దక్కడం పట్ల కథానాయకుడు చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా వాళ్లిద్దరి నివాసాలకు వెళ్లి.. వారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. తెలుగు సినిమాకి లభించిన ఈ జాతీయ గౌరవం ఒక మైలురాయిగా చిరు పేర్కొన్నారు. ఇక ఈ సందర్భంగానే కళలు, విజ్ఞానం, వైద్యం, సాహిత్యం, క్రీడలు లాంటి రంగాల్లో విశేష సేవలందించిన 2026 పద్మ అవార్డు విజేతలందరికీ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు చిరంజీవి.

## ఇంత పెద్ద గౌరవం.. ఆయన మన మధ్య లేరు!



సినీ పరిశ్రమకు చేసిన సేవలను గుర్తించి దివంగత బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు కేంద్రం దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన భార్య హేమా మాలిని ఆనందం వ్యక్తం చేశారు. కానీ.. ఈ అవార్డు అందుకోవడానికి ఆయన మన మధ్య లేకపోవడం బాధగా ఉందన్నారు. "మా కుటుంబం మొత్తం చాలా సంతోషంగా ఉంది. ధర్మేంద్ర ఈ పురస్కారానికి అర్హుడు. అభిమానులు, సినీ పరిశ్రమకు చెందినవారంతా ఇప్పుడు ధర్మేంద్ర గురించి, ఆయన చేసిన మంచి పనుల గురించి మాట్లాడుకుంటున్నారు. అవి వింటుంటే మా హృదయాలు ఆనందం, గర్వంతో నిండిపోతున్నాయి. ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం రావాలని ఎంతోమంది కోరుకున్నారు. ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదు. తన పాత్రకు పూర్తి న్యాయం చేయాలని నిరంతరం శ్రమించారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. ఆయనకు జీవిత సాఫల్య పురస్కారాలు తప్ప ఒక్క ఫిల్మ్ ఫేర్ కూడా రాలేదు. ఇప్పుడు ఇంత పెద్ద అవార్డును తీసుకోవడానికి ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం" అన్నారు హేమ. ధర్మేంద్రకు పురస్కారాన్ని ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## చెడుకు పీడ కల.. రణబాలి



"ప్రజల కోసం పురాణంగా మారిన వ్యక్తి. చెడుకు పీడ కలగా మారిన పురాణ పురుషుడు. అతని పేరే 'రణబాలి" అంటున్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్నారు. 'టాక్సీవాలా' విజయం తర్వాత వీళ్లిద్దరి కాంబోలో రెండో సినిమా ఇది. టీ సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమాకి 'రణబాలి' అనే పేరును ఖరారు చేస్తూ.. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ సినిమా ముస్తాబవుతోంది. పచ్చటి పైర్లతో అలరారే మన గ్రామ సీమల్ని బ్రిటిష్ క్రూర పాలకులు కరవు ప్రాంతాలుగా ఎలా మార్చారో.. మన సమాజంలో హిట్లర్ ఊచకోతను మించిన మారణ హోమాన్ని ఎలా సృష్టించారో గ్లింప్స్‌లో హృద్యంగా చూపించారు. ఇందులో మాతృభూమి కోసం ఆ తెల్లదొరలపై తిరుగుబాటు చేసే యోధుడిగా విజయ్ కనిపించిన తీరు ఆకట్టుకుంది. గ్లింప్స్ ఆఖర్లో తను బ్రిటిష్ అధికారిని గుర్రానికి కట్టి రైల్వే ట్రాక్‌పై ఈడ్చుకు వెళ్లే సన్నివేశం ఆకర్షణగా నిలిచింది. ఇక ఈ సినిమాలో జయమ్మగా రష్మిక కనిపించనుండగా.. సర్ థియోడోర్ హెక్టార్ అనే బ్రిటిష్ అధికారి పాత్రలో ఆర్నాల్డ్ అలరించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా సెప్టెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.

## ఏప్రిల్‌లో పేట్రియాట్

మహేశ్ నారాయణన్ దర్శకత్వంలో మలయాళ అగ్ర కథానాయకులు మోహన్‌లాల్, మమ్ముట్టి కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్, నయనతార, గౌతమి, రాజీవ్ మేనన్, కుంచకో బోబన్, రేవతి తదితరులు నటిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమా ఏప్రిల్ 23న థియేటర్లలో విడుదల కానుందని పేర్కొంటూ.. ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ను పంచుకుంది.

**మోహన్‌లాల్ ఎల్ 367**

మోహన్‌లాల్ తన తదుపరి చిత్రం ఎల్367ని సామాజిక మాధ్యమాలలో అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాని తొలి దర్శకత్వం 'మెప్పాడియన్' చిత్రంతో జాతీయ అవార్డు సాధించిన విష్ణు మోహన్ తెరకెక్కించనున్నారు. గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మించనున్నారు. ఈ సినిమా థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్నట్లు సమాచారం.



## కివీస్‌తో నాలుగో టీ20..
## వైజాగ్‌కు చేరుకున్న భారత ఆటగాళ్లు



భారత్, న్యూజిలాండ్ (IND vs NZ) మధ్య విశాఖపట్నం వేదికగా నాలుగో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్ కోసం భారత్ ఆటగాళ్లు విశాఖపట్నం చేరుకున్నారు. గువాహటి నుంచి ప్రత్యేక విమానాల్లో వైజాగ్‌కు టీమ్ఇండియా ప్లేయర్లు వచ్చారు. విశాఖ విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన వారికి కేటాయించిన బస్సుల్లో హోటల్‌కు వెళ్లిపోయారు. న్యూజిలాండ్ ప్లేయర్లు కూడా వైజాగ్ చేరుకున్నారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే భారత్ 30తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. విశాఖపట్నంలో టీ20ల్లో భారత్‌కు మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడి మూడింట విజయం సాధించింది. టీమ్ఇండియా, న్యూజిలాండ్ మధ్య వైజాగ్‌లో టీ20 మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి. ఈ నెల 28న (బుధవారం) నాలుగో మ్యాచ్ జరగనుంది.

## బ్రాడ్‌మన్ టోపీకి రూ.4 కోట్ల 21 లక్షలు



గోల్డ్‌కోస్ట్: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ ఉపయోగించిన బ్యాగీ గ్రీన్ టోపీకి భారీ ధర పలికింది. 194748లో భారత క్రికెటర్ శ్రీరంగ వాసుదేవ్ సొహోనికి బ్రాడ్‌మన్ బహుమతిగా ఇచ్చిన టోపీని సోమవారం వేలం వేయగా.. రూ.4 కోట్ల 21 లక్షలకు అమ్ముడుపోయింది. శ్రీరంగ వాసుదేవ్ కుటుంబం ఈ టోపీని 75 ఏళ్ల నుంచి భద్రపరిచింది. ఈ టోపీ లోపల బ్రాడ్‌మన్, వాసుదేవ్ పేర్లు ఉన్నాయి. గతంలోనూ బ్రాడ్‌మన్ టోపీలను వేలం వేయగా భారీ ధర పలికాయి. 194748లో లాలా అమర్‌నాథ్ సారథ్యంలోని భారత జట్టు.. ఆస్ట్రేలియా పర్యటించింది. అయిదు టెస్టుల సిరీస్‌ను 40తో ఓడింది. ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి ఆస్ట్రేలియా పర్యటన అదే.

## ఛాంపియన్ ఇంటికి!

**–పెగులా చేతిలో కీస్ ఓటమి**

**–క్వార్టర్స్‌లో సినర్, స్వైటెక్, అనిసిమోవా**



ఆస్ట్రేలియన్ ఓపెన్లో మహిళల సింగిల్స్ డిఫెండింగ్ ఛాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) కథ ముగిసింది. సోమవారం ప్రిక్వార్టర్స్‌లో తొమ్మిదో సీడ్ కీస్ 36, 46తో ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) చేతిలో వరుస సెట్లలో ఓడింది. పెగులాతో ఆడిన గత మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన కీస్.. ఈసారి మాత్రం ఆ జోరు చూపించలేకపోయింది. తొలి సెట్ నుంచే కీస్ తడబాటు మొదలైంది. 14తో వెనుకబడిన ఆమె.. సెట్ కోల్పోయింది. రెండో సెట్లోనూ కీస్ ఆట మారలేదు. దీంతో తొలి గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన పెగులా 31తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే దూకుడుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. 6 డబుల్‌ఫాల్ట్స్, 28 అనవసర తప్పిదాలు చేసిన కీస్.. ఓటమి కొనితెచ్చుకుంది. రెండో సీడ్ ఇగా స్వైటెక్ (పోలెండ్) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో ఆమె 60, 63తో మాడిసన్ ఇంగ్లిస్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేసింది. తొలి గేమ్‌లో స్వైటెక్ దూకుడు ముందు మాడిసన్ ఏమాత్రం నిలవలేకపోయింది. ఆరు గేమ్‌లను తానే గెలుచుకున్న స్వైటెక్ తేలిగ్గా సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్లో ఇంగ్లిస్ కాస్త మెరుగ్గానే ఆడినా.. స్వైటెక్ జోరు కొనసాగించింది. నాలుగో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి 41తో ఆధిక్యంలో నిలిచింది. అదే దూకుడుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నాలుగో సీడ్ అనిసిమోవా (అమెరికా), అయిదో సీడ్ రిబకినా (కజకిస్థాన్) కూడా క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. అనిసిమోవా 76 (74), 64తో వాంగ్ (చైనా) పోరాటానికి తెరదించగా.. రిబకినా 61, 63తో మెర్టిన్స్ (బెల్జియం)పై గెలిచింది.

**సినర్ ముందుకు:** టైటిల్ ఫేవరెట్ యానిక్ సినర్ (ఇటలీ) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ 61, 63, 76 (72)తో దర్దెరి (ఇటలీ)పై గెలిచాడు. ఆరంభం నుంచి సినర్ దూకుడుగా ఆడాడు. రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి ఆపై 30తో ఆధిక్యంలోకి వెళ్లిన సినర్.. తేలిగ్గా తొలి సెట్ గెలుచుకున్నాడు. రెండో సెట్లో దర్దెరి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. కానీ ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన సినర్.. ఆపై సెట్ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్నాడు. మూడో సెట్ హోరాహోరీగా సాగింది. టైబ్రేకర్‌లో పైచేయి సాధించిన సినర్.. మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో సినర్ 19 ఏస్‌లు, 46 విన్నర్లు కొట్టాడు. మరో ప్రిక్వార్టర్స్‌లో అయిదో సీడ్ ముసెటి (ఇటలీ) 62, 75, 64తో తొమ్మిదో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా)ను ఓడించాడు. ఇంకో మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ షెల్టాన్ (అమెరికా) 36, 64, 63, 64తో కాస్పర్ రూడ్ (నార్వే)పై నెగ్గాడు.

**యుకి ఔట్**: పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ యుకి బాంబ్రి పోరాటం ముగిసింది. మూడో రౌండ్లో యుకి గొరాన్‌సన్ (స్వీడన్) జంట 67 (79), 36తో ఆర్నాల్డో లూస్‌మాటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో ఓడింది.



# టీ20 ప్రపంచ కప్.. పాక్‌వి వట్టిమాటలేనా?



బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీ20 ప్రపంచకప్ (T20 World Cup 2026)ను బహిష్కరిస్తామంటూ బెదిరించిన పాకిస్థాన్ ఆదివారం తమ జట్టును ప్రకటించింది. అయితే, తాము టోర్నీలో పాల్గొనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మీద ఆధారపడి ఉంటుందని పీసీబీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీ పేర్కొన్నారు. బంగ్లాదేశ్ పట్ల ఐసీసీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్రపంచ కప్‌లో తమ జట్టును ఆడించొద్దని పాకిస్థాన్ నిర్ణయం తీసుకునే అవకాశముందట. ఒకవేళ టోర్నీలో పాల్గొన్నా భారత్‌తో మ్యాచ్‌ను (IND vs PAK) బహిష్కరించాలని యోచిస్తోందని సమాచారం. ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లను శ్రీలంకలో షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. ‘‘తుది నిర్ణయం ప్రధానమంత్రిపై ఆధారపడి ఉంటుంది. అయితే టీ 20 ప్రపంచ కప్‌లో పాల్గొనడానికి ప్రభుత్వం అనుమతించకపోవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇది క్రికెట్‌కు సంబంధించిన విషయం మాత్రమే కాదు. ఒక దేశ గౌరవంతో ముడిపడి ఉన్న అంశం. బంగ్లాదేశ్ తన చట్టబద్ధమైన హక్కును కోల్పోయింది. బంగ్లా పట్ల ఐసీసీ వ్యవహరించిన వైఖరితో పాకిస్థాన్ కూడా టోర్నీలో పాల్గొనడంపై పునరాలోచన చేస్తోంది. అంతర్జాతీయ క్రీడల్లో ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు. ఒకవైపు భారత్‌కు వేదికలను ఎంచుకునే స్వేచ్ఛ ఇచ్చారు. బంగ్లాదేశ్ భద్రతా కారణాలతో వేదికలను మార్చాలంటే తిరస్కరించారు. ఐసీసీ నిజంగా క్రికెట్ ప్రపంచ క్రీడగా అభివృద్ధి చెందాలని కోరుకుంటే అటువంటి ఎంపిక విధానాలకు ముగింపు పలకాలి’’ అని పాక్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**--పీసీబీ మూడు ఆప్షన్లు!....**టీ20 ప్రపంచ కప్ గురించి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మూడు ఆప్షన్లను పరిశీలిస్తోందని అక్కడి మీడియాలో వార్తలొస్తున్నాయి. మొదటిది.. టోర్నీలో ఆడితే అన్ని మ్యాచ్‌ల్లోనూ చేతులకు నల్ల బ్యాండ్‌లు ధరించడం. ఫిబ్రవరి 15న కొలంబోలో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం రెండోది. టోర్నీలో తాము సాధించే ప్రతి విజయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ మద్దతుదారులకు అంకితం చేయాలని మూడో ఆప్షన్‌గా పీసీబీ భావిస్తోందట.

## బంగ్లాదేశ్‌ను పాక్ రెచ్చగొడుతోంది.. ఇది తప్పు: బీసీసీఐ ఉపాధ్యక్షుడు

టీ20 ప్రపంచ కప్ 2026 (T20 World Cup) విషయంలో బంగ్లాదేశ్‌ను పాకిస్థాన్ తప్పుదోవ పట్టించిందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా (Rajeev Shukla) అన్నారు. తమ స్వలాభం కోసం బంగ్లాను రెచ్చగొడుతోందని మండిపడ్డారు. ‘ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ ఆడాలని భారత్ కోరుకుంది. ఆ జట్టు ఆటగాళ్లకు పూర్తి భద్రత కల్పిస్తామని మేం హామీ కూడా ఇచ్చాం. అయినప్పటికీ.. కొలంబోలో మాత్రమే మ్యాచ్‌లు ఆడతామని బంగ్లా పట్టుబట్టింది. చివరి నిమిషంలో మొత్తం షెడ్యూల్‌ను మార్చడం చాలా కష్టమైన పని. అందుకే స్కాట్లాండ్‌ను ప్రత్యామ్నాయ జట్టుగా ఎంపిక చేశారు. పాకిస్థాన్ దురుద్దేశంతో బంగ్లాను ప్రోత్సహిస్తోంది. ఆ దేశం అనవసరంగా ఈ విషయలో జోక్యం చేసుకుంటూ బంగ్లాను తప్పుదోవ పట్టిస్తోంది. వారిని రెచ్చగొట్టడంలో పాక్ ప్రధానపాత్ర పోషిస్తోంది. ఇలా చేయకూడదు. బంగ్లాదేశీయులపై పాకిస్థాన్ ఎలాంటి దారుణాలకు పాల్పడిందో ప్రపంచానికి తెలుసు. దేశం విడిపోయినప్పుడు తమకు ఎంత అన్యాయం జరిగిందో బంగ్లాదేశీయులకు తెలుసు. పాక్ ఇప్పుడు వారి శ్రేయోభిలాషిగా నటిస్తూ బంగ్లాను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోంది. ఇది తప్పు’ అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు వివరించారు. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించడంతో ఆ స్థానంలో స్కాట్లాండ్ ఆడుతుందని ఐసీసీ ప్రకటించింది. ఫిబ్రవరి 7న టీ20 ప్రపంచ కప్ ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.



# సమయం లేదు శాంసన్!

**గత నెల దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో సంజు శాంసన్‌ను పక్కన పెట్టి శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్‌గా ఆడిస్తుంటే.. సామాజిక మాధ్యమాల్లో ఇదేం న్యాయం అన్న ప్రశ్నలు తలెత్తాయి. సంజునే తుది జట్టులో ఉండాల్సిందనే అభిప్రాయాలు వినిపించాయి. సిరీస్ చివర్లో సంజుకు అవకాశం దక్కింది. టీ20 ప్రపంచకప్ జట్టులో గిల్ మీద వేటు వేసి సంజుకే ఓపెనర్‌గా ఛాన్స్ ఇచ్చారు. కానీ ఇప్పుడు సంజు ఆట చూస్తుంటే అతను తుది జట్టులో చోటుకు అర్హుడేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కివీస్‌తో మిగతా రెండు టీ20ల్లో సత్తా చాటుకోకపోతే ప్రపంచకప్‌లో శాంసన్‌ను ఓపెనర్‌గా చూడడం కష్టమే.**



మిగతా దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే క్రికెట్ సంస్కృతి కొంచెం తక్కువగా ఉండే కేరళ నుంచి వచ్చిన సంజు శాంసన్.. తన ప్రతిభతో టీనేజీలోనే జాతీయ స్థాయిలో మంచి గుర్తింపే సంపాదించాడు. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించడం ద్వారా పదేళ్ల కిందటే, 20 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. కానీ దశాబ్దం తర్వాత చూస్తే.. ఇప్పటికీ జట్టులో తన స్థానం సుస్థిరం కాలేదు. కొన్నేళ్లుగా అతను టీ20 జట్టులో రెగ్యులర్ ఆటగాడిగానే ఉన్నప్పటికీ.. తుది జట్టులో మాత్రం స్థానం పదిలం చేసుకోలేకపోయాడు. అందుక్కారణం నిలకడ లేమే. 55 టీ20ల్లో అతను 24.57 సగటే నమోదు చేయగలిగాడు. 2024లో కేవలం అయిదు మ్యాచ్‌ల వ్యవధిలో అతను మూడు శతకాలు బాదడం విశేషం. అందులో రెండు దక్షిణాఫ్రికాలో సాధించాడు. అయితే ఈ మూడు శతకాలను మినహాయిస్తే.. టీ20ల్లో సంజు గణాంకాలు పేలవం. చివరగా శతకం సాధించాక.. 18 టీ20ల్లో శాంసన్ ఒక్క అర్ధశతకమే సాధించాడు. ఈ కాలంలో తన సగటు 17 మాత్రమే. శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా అవకాశం దక్కించుకోవడం వల్ల గత నెల దక్షిణాఫ్రికాతో అయిదు టీ20ల సిరీస్‌లో ఒక్క మ్యాచే ఆడగలిగాడు. కానీ గిల్ వైఫల్యం నేపథ్యంలో అతడిపై వేటు వేసి న్యూజిలాండ్‌తో సిరీస్‌కే కాక టీ20 ప్రపంచకప్‌నకు కూడా సంజునే ఓపెనర్‌గా ఎంపిక చేశారు సెలక్టర్లు. కానీ కివీస్‌తో తొలి మూడు టీ20ల్లో శాంసన్ వరుసగా 10, 6, 0 పరుగులే చేయగలిగాడు. మూడో టీ20లో హెన్రీ బౌలింగ్‌లో పేలవ రీతిలో బౌల్డయ్యాక సంజు మీద తీవ్ర విమర్శలు తప్పలేదు. అతడి టెక్నిక్ మీద అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంచి వేగం ఉన్న పేసర్లను ఎదుర్కోవడంలో అతను తడబడుతున్నాడు. ఫామ్‌తో తంటాలు పడుతున్నప్పుడు క్రీజులో నిలదొక్కుకోవడం మీద దృష్టిపెట్టకుండా అతను నేరుగా షాట్లకు ప్రయత్నించి ఔటవుతున్నాడు.

అవతల అభిషేక్ శర్మ రూపంలో దూకుడైన ఓపెనర్ ఉన్న నేపథ్యంలో సంజుకు కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్నా ఇబ్బంది లేదు. కానీ అతనా దిశగా ఆలోచించట్లేదు. ఐపీఎల్ మొదలుకుని అంతర్జాతీయ క్రికెట్ వరకు శాంసన్‌కు ఉన్న అతి పెద్ద సమస్య నిలకడ లేమి. వరుసగా రెండు మూడు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి అంచనాలు పెంచడం.. ఆ తర్వాత వరుసగా విఫలమవడం.. ఇదీ వరస. అందువల్లే దేశవాళీల్లోనే కాక అంతర్జాతీయ క్రికెట్లోనూ తన గణాంకాలు అంత గొప్పగా ఉండవు. ప్రతిభకు లోటు లేకపోయినా.. దానికి న్యాయం చేసే నిలకడ లేకపోవడంతో అతను ఇప్పటికీ జట్టులో స్థానం కోసం పోరాడాల్సిన స్థితిలో ఉన్నాడు. పొంచి ఉన్న ఇషాన్ ముప్పు: కివీస్‌తో సిరీస్ ఆరంభానికి ముందు పరిస్థితి చూస్తే.. ప్రపంచకప్‌లో సంజునే ఓపెనర్ అన్నట్లు కనిపించింది. కానీ ముస్తాక్ అలీ ట్రోఫీలో సత్తా చాటి అనుకోకుండా టీ20 జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్.. ఇప్పుడు సంజు స్థానానికి ఎసరు పెట్టేలా కనిపిస్తున్నాడు. తిలక్ వర్మ శస్త్రచికిత్స వల్ల కివీస్‌తో సిరీస్‌కు దూరం కావడంతో ఇషాన్‌కు తుది జట్టులో అవకాశం దక్కింది. దీన్ని అతను బాగానే ఉపయోగించుకుంటున్నాడు. రెండో టీ20లో మెరుపు ఇన్నింగ్స్ (32 బంతుల్లో 76)తో ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచాడు. మూడో టీ20లోనూ అతను ఉన్నంతసేపు చెలరేగాడు. ప్రపంచకప్‌నకు తిలక్ వర్మ అందుబాటులోకి రానున్నాడు. మిడిలార్డర్లో కీలక బ్యాటర్‌గా ఎదిగిన అతడికి తుది జట్టులో చోటు ఖాయం. తన కోసం తుది జట్టులో ఎవరు స్థానాన్ని ఖాళీ చేస్తారన్నది ప్రశ్న. సంజు, ఇషాన్ ఇద్దరూ వికెట్ కీపర్ బ్యాటర్లే కాబట్టి ఒకరిపై వేటు తప్పదు. ప్రస్తుత ఫామ్ ప్రకారం ఇషానే తుది జట్టులో స్థానానికి అర్హుడు. అతను ఓపెనింగ్ కూడా చేయగలడు కాబట్టి ఇబ్బంది లేదు. కాకపోతే అభిషేక్ కూడా ఎడమ చేతి వాటం బ్యాటర్ కావడంతో ఇషాన్‌ను పక్కన పెట్టాలని జట్టు యాజమాన్యం భావించవచ్చు. కానీ చివరి రెండు టీ20ల్లో శాంసన్ ఆటతీరు మారకపోతే మాత్రం ఇషానే తుది జట్టులో ఉంటాడేమో! ‘‘సంజు సాంకేతికంగానే కాక మానసికంగానూ కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నాడు. కొందరు బౌలర్ల వేగం అతణ్ని తడబాటుకు గురి చేస్తోంది. 130 కిలోమీటర్ల వేగంతో బంతులేస్తే అతను బాగా ఎదుర్కొంటాడు. వేగం అంతకంటే మించినా, తగ్గినా, బంతుల్లో వైవిధ్యం చూపించినా ఇబ్బంది పడుతున్నాడు. బంతి వేగానికి తగ్గట్లుగా అతడి బ్యాట్ వేగాన్ని సర్దుబాటు చేసుకోవాలి. పరిమిత ఓవర్ల క్రికెట్లో వికెట్ కీపర్ బ్యాటర్ స్థానానికి విపరీతమైన పోటీ ఉండడం వల్ల సంజు ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. కానీ శాంసన్ ప్రతిభావంతుడు. భారత జట్టుకు విజయాలు అందించే సామర్థ్యం అతడికి ఉంది’’

## తిలక్ చివరి రెండు టీ20లకూ..

టీమ్ఇండియా బ్యాటర్ తిలక్ వర్మ న్యూజిలాండ్‌తో చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు కూడా దూరమయ్యాడు. ఇంకా అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తిలక్ కోలుకుంటున్నాడు. ప్రస్తుతం అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉన్నాడు. చివరి రెండు మ్యాచ్‌లకు తిలక్ అందుబాటులో ఉంటాడని మొదట భావించారు. కానీ అతడు పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడి స్థానంలో జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్‌ను ఆఖరి రెండు మ్యాచ్‌లకూ కొనసాగించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి తిలక్‌కు మరింత సమయం అవసరమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. టీ20 ప్రపంచకప్ సన్నాహక మ్యాచ్ నేపథ్యంలో తిలక్.. ఫిబ్రవరి 3న భారత జట్టుతో కలుస్తాడన్నాడు.

